మహబూబ్‌నగర్
నాగర్‌కర్నూల్
జోగులాంబగద్వాల్
నారాయణపేట
వనపర్తి

సూర్య

www.suryaa.com

17వ వసంతంలోకి

బుధవారం 13 మార్చి 2024 | పేజీలు 8

# నేడు సంగంబండకు మంత్రులు భట్టి, ఉత్తమ్ రాక

## - ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, యస్.పి యోగేష్ గౌతమ్



**మక్తల్, మేజర్‌న్యూస్:** మఖ్తల్ మండలం లోని సంగంబండ లో ప్రజా దీవెన సభలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నేడు పాల్గొననున్నారు. ఈ సందర్భం గా రిజర్వాయర్ వద్ద బండరాయిని పరిశీలించనున్నారు. ఇందుకోసం హైదరా బాదు నుండి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ,భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డిలు హెలికాప్టర్లో నారాయణపేట జిల్లా మక్తల్ మండలంలోని సంగంబండ గ్రామానికి బుధవారం 10 గంటలకు చేరుకోనున్నారు.ఇందుకుగాను మంగళవారం సంగంబండ వద్ద

మిగతా 2లో

### నాగర్‌కర్నూల్ పార్లమెంట్‌ను

# భారీ మెజార్టీతో కైవసం చేసుకుంటాం

## - ఛలో వనపర్తి సభలో ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్



**వనపర్తి ప్రతినిధి, మేజర్‌న్యూస్:** రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో నాగర్ కర్నూల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిని మూడు లక్షల భారీ మెజార్టీతో గెలిపించుకుందామని ఏఐసీసీ కార్యదర్శి అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ పిలుపుని చ్చారు. మంగళవారం వనపర్తి జిల్లా కేంద్రంలో రేవంతన్నకు దండుగా... ప్రజా పాలనకు అండగా ఛలో వనపర్తికార్యక్రమాన్ని నిర్వహించారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని ప్రధాన వీధుల గుండార్యాలీ నిర్వహించిన సంపత్‌కుమార్ రాజీవ్‌చౌక్‌లో కాంగ్రెస్ కార్యకర్తలనుద్దేశించి ప్రసంగించారు. తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీ రుణం తీర్చుకునేందుకు ప్రతి ఒక్కరు పార్లమెంట్ ఎన్నికల్లో హస్తం గుర్తుపై ఓటు వేసి రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా ఎన్నుకునేందుకు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఉమ్మడి పాలమూరు జిల్లాలోని మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్ పార్లమెంట్ స్థానాలను కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గత రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని కాంగ్రెస్ పార్టీ

మిగతా 2లో

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో నవీన్ రెడ్డి దూకుడు

## - జీవన్ రెడ్డితో ఢీ కొట్టేందుకు రెడీ - అండగా బిఆర్‌యస్ శ్రేణులు

**మహబూబ్‌నగర్ బ్యూరో, మేజర్ న్యూస్ :** ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని నందిగామ మండలం మొదళ్ళగూడకు చెందిన నాగర్‌కుంట నవీన్‌రెడ్డి బిఆర్‌యస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా రంగంలో ఉన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డితో ఢీ అంటే ఢీ అనే రీతిలో ఎన్నికల సమరానికి సిద్ధం అవుతున్నారు. ఆర్థిక అంగబలంలో తగ్గేదే లేదు అంటు దూకుడు పెంచారు. నవీన్ రెడ్డికి బిఆర్‌యస్ శ్రేణులు అండగా నిలబడడం జరగబోయే ఎన్నికల్లో గెలుపు ఖాయం అని ధీమా వ్యక్తం చేస్తున్నారు. మహబూబ్‌నగర్ బిఆర్‌యస్ స్థానిక సంస్థల బిఆర్‌యస్ ఎన్నికల అభ్యర్థి నవీన్ రెడ్డి స్థిరాస్థి వ్యాపారి కావడంతో ఆర్థిక ఇబ్బందులు లేవని పలువురు భావిస్తున్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ కూడా ఇతని స్థాయిని గుర్తించి జడ్‌పి వైస్ చైర్మన్ పదవి కట్టబెట్టింది. అయితే గత అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ రాకపోవడం, తన రాజకీయ ప్రత్యర్థి ఈర్లపల్లి శంకర్‌కు అవకాశం రావడంతో ఆయన కాంగ్రెస్ నుండి బిఆర్‌యస్‌కు చేరారు. స్థానిక సంస్థల్లో బిఆర్‌యస్‌కు కాంగ్రెస్ కంటే అత్యధిక స్థానాలు ఉండడంతో ఇతని గెలుపు నల్లేరుమీద నడికే అంటున్నారు. తాను నమ్మిన నాయకునికోసం అంకిత భావంతో పనిచేసే నవీన్‌రెడ్డి ఇప్పుడు సొంతంగా తనకే ఎమ్మెల్సీ అవకాశం రావడంతో దీన్ని ఛాలెంజ్‌గా తీసుకొని రాజకీయ చతురుతతో వ్యూహాలు రచిస్తున్నారు. రాజకీయాలతో పాటు సేవారంగంలో కూడా నవీన్ రెడ్డి పాల్గొంటుండడంతో యువకుల్లో మంచి ఆదరణ ఉంది. మరో ప్రక్క కాంగ్రెస్ అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డికి ఆర్థికంగా తక్కువేమి కాకపోయిన అనుభవం మాత్రం నవీన్‌రెడ్డిదే పై చెయ్యిగా ఉంది. బిఆర్‌యస్ ఓటర్లు చాలా మంది ఉన్నారు. వారికి కావలసింది చేస్తే సరిపోతుందని నవీన్ రెడ్డి భావిస్తున్నారు. గెలుపు కోసం ప్రయత్నిస్తున్నారు.



# ఎన్నికల నిర్వహణకు అన్నివిధాలా సన్నద్ధం కావాలి

## - రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్



**నాగర్ కర్నూలు, మేజర్‌న్యూస్:** పార్లమెంటు ఎన్నికలకు సంబంధించి భారత ఎన్నికల సంఘం ద్వారా ఏ క్షణంలోనైనా షెడ్యూల్ వెలువడే అవకాశం ఉన్నందున ఎన్నికల నిర్వహణ కోసం అన్ని విధాలుగా సన్నద్ధమై ఉండాలని, ఎన్నికల ఏర్పాట్లను మరింత ముమ్మరం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ సూచించారు. మంగళవారం సాయంత్రం జిల్లా కలెక్టర్లు, అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల రిటర్నింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన ఎన్నికల నిర్వహణ అంశాలపై సుదీర్ఘ సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా నాగర్ కర్నూల్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి ఉదయ్ కుమార్,, అదనపు కలెక్టర్లు కుమార్ దీపక్, కె సీతారామారావు, తో కలిసి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి పాల్గొన్నారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ , మాట్లాడుతూ ఓటరు నమోదు, మార్పులు-చేర్పులకు సంబంధించిన దరఖాస్తుల పరిశీలన, వాటి సత్వర పరిష్కారం, 18 - 19 వయస్సు కలిగిన యువతచే ఓటరు జాబితాలో పేర్లు నమోదు కోసం దరఖాస్తులు చేయించడం, మోడల్ పీ.ఎస్ ల ఏర్పాటు, మృతి చెందిన, వలస వెళ్లిన ఓటర్ల విషయంలో చేపట్టాల్సిన చర్యలు, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల రాండమైజేషన్, భద్రతాపరమైన ఏర్పాట్లు తదితర అంశాలను సమీక్షిస్తూ, జిల్లా ఎన్నికల అధికారులకు మార్గనిర్దేశం చేశారు. న్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని ఇప్పటికే నియమించినట్లైతే శనివారం మొదటి ర్యాండమైజేషన్ జరపాలని, ఈ.వీ.ఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియను కూడా ఒకే రోజున, ఒకే సమయంలో అన్ని జిల్లాలలో చేపట్టాలని సూచించారు. ఎన్నికల సిబ్బందికి తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ సదుపాయం అందుబాటులో ఉండేలా చూడాలని, తమకు పోస్టల్ బ్యాలెట్ వసతి కల్పించలేదని ఏ ఒక్కరు కూడా ఫిర్యాదు చేసేందుకు ఆస్కారం కల్పించవద్దని హితవు పలికారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో ఆర్డీఓలు , కే సురేష్ బాబు,కే మాధవి,శ్రీను, ఎన్నికల విభాగం అధికారులు ,సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

## - జిల్లా కలెక్టర్ బి.ఎం సంతోష్



**గద్వాల ప్రతినిధి, మేజర్ న్యూస్:** వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి.ఎం సంతోష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం గద్వాల్ పరిధిలోని గోనుపాడు గ్రామంలో మిషన్ భగీరథ త్రాగు నీటి సరఫరాను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడుతూ, ప్రజలకు ఇబ్బంది కలగకుండా వేసవిలో త్రాగునీటిపై ప్రత్యేక దృష్టి సారించాలని, మిషన్ భగీరథ ద్వారా త్రాగునీరు సరఫరా చేయాలన్నారు. నీరు వృధా కాకుండా చూడాలని, ప్రతిరోజు క్లోరినేషన్ చేయాలని సూచించారు. లీకేజీలు లేకుండా చూసుకోవాలని, తెలిపారు. ఈ సందర్భంగా త్రాగు నీరు, బల్క్ వాటర్ సౌలభ్యత, నీటి సరఫరాపై మిషన్ భగీరథ అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామ పంచాయితి కార్యాలయంలో నీటి సరఫరాకు సంబంధించిన ఏడు రిజిస్టర్లను, క్లోరోస్కోప్ ద్వారా నీటి స్వచ్ఛతను పరిశీలించే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఎస్ ఈ జగన్మోహన్, ఈఈ శ్రీధర్ రెడ్డి, డీఈ లు, ఏఈ లు, ఎం.పి.డి. ఓ. ఉమాదేవి, గ్రామ ప్రత్యేక అధికారి శివకుమార్, ఎం పి ఓ చెన్నయ్య, గ్రామ కార్యదర్శి సాలేహ తదితరులు పాల్గొన్నారు.

# సి.యం.ఆర్ వరిధాన్యం పూర్తి అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలి

## - కేంద్ర ఆహార సంస్థకు ఇవ్వాల్సిన వరి ధాన్యం నివేదిక ఇవ్వాలి - కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్

**వనపర్తి ప్రతినిధి, మేజర్ న్యూస్ :** కేంద్ర ఆహార సంస్థకు ఇవ్వాల్సిన సి.యం.ఆర్ వరి ధాన్యం పూర్తి అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్ ఆదేశించారు. మంగళవారం ఉదయం కలెక్టర్ తన క్యాంప్ కార్యాలయంలో పౌర సరఫరాల శాఖ అధికారులు, సిబ్బందితో సి.యం.ఆర్ రైస్, గ్యాస్ సిలిండర్ల పంపిణీ, పెట్రోల్ బంక్ లో నిర్వహణ తదితర అంశాల పై సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. వనపర్తి జిల్లా రైస్ మిల్లుల నుండి కేంద్ర ఆహార సంస్థకు ఇవ్వాల్సిన వరి ధాన్యం అప్పగించడం పై పూర్తి నివేదిక ఇవ్వాల్సిందిగా సివిల్ సప్లై అధికారిని ఆదేశించారు. రైస్ మిల్లులు ధాన్యం అప్పగింత పై ఇప్పటి వరకు తీసుకున్న చర్యల పై నివేదిక కోరారు. జిల్లాలో గ్యాస్ సిలిండర్ల సరఫరా, సమస్యల పై నివేదిక ఇవ్వాల్సిందిగా కోరారు. జిల్లాలోని పెట్రోల్ బంకలలో ఉన్న మౌలిక సదుపాయాలు ఇతరత్రా సమస్యలను పరిశీలించి నివేదిక ఇవ్వాల్సిందిగా ఆదేశించారు. జిల్లా సివిల్ సప్లై అధికారి శ్రీనాథ్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు సంగంబండకు మంత్రులు భట్టి, ఉత్తమ్ రాక

(మొదటిపేజీ తరువాయి)

హెలిప్యాడ్, మక్తల్ ప్రజాదీవన సభ జరగనున్న ఏర్పాట్లను జిల్లా యస్.పి యోగేష్ గౌతం స్థానిక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరితో కలిసి స్థలాన్ని పరిశీలించారు. మంత్రుల పర్యటన సందర్భంగా బహిరంగ సభకు పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ప్రజలు తరలిరానున్న నేపద్యంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా బందోబస్తు ఏర్పాటు సదుపాయాలను యస్.పి దగ్గరుండి పర్యవేక్షించారు. పార్కింగ్, సభాస్థలి, హెలిప్యాడ్ ఏర్పాటుకు గాను ఆయచోట్ల తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై యస్.పి యోగేష్ గౌతమ్ డి.యస్.పి లింగయ్య ,సిఐ చంద్రశేఖర్ లకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో నారాయణపేట డి.యస్.పి, లింగయ్య, స్థానిక సీఐ చంద్రశేఖర్, యస్.ఐ వై.భాగ్య లక్ష్మి రెడ్డి , కాంగ్రెస్ నాయకులు గవినోళ్ళ బాలకృష్ణారెడ్డి ,జి. గోపాల్ రెడ్డి ,జి .లక్ష్మారెడ్డి,బోయ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## భారీ మెజార్టీతో కైవసం చేసుకుంటాం

(మొదటిపేజీ తరువాయి)

ప్రజలకు ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేస్తుందన్న నమ్మకంతో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి ప్రజలు గెలిపించాలని ఆయన అన్నారు. దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీని గెలిపించేందుకు ప్రజలందరూ సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ యాదవ్, అతిక్ కోఆర్డినేటర్ జిల్లెల ఆదిత్యరెడ్డి, కాంగ్రెస్ నాయకులు చారకొండ వెంకటేష్, వనపర్తి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కదిరె రాములు, ఓబీసీ జిల్లా అధ్యక్షులు కోట్ల రవి, నందిమల్ల యాదయ్య, దివాకర్, రోహిత్, రాగివేణు, భాస్కర్, తదితరులు ఉన్నారు.

## అతిథి అధ్యాపక పోస్ట్ కొరకు దరఖాస్తుల ఆహ్వానం



**నాగర్కర్నూల్ ఎడ్యుకేషన్ మేజర్ న్యూస్ :** నాగర్‌కర్నూలు జిల్లా కేంద్రం శ్రీపురం రోడ్డులో గల ప్రభుత్వ డిగ్రీ %డ% పి జి (ఆర్ట్స్ అండ్ కామర్స్) కళాశాల యందు %జూశీశ్రీఱ-అఝశ్రీ ంఎఱవఅఎవ% బోధించుటకు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుం దని, అభ్యర్థులు పీ జీలో కనీసం 55 శాతం మరియు ఎస్సీ ఎస్టీ అభ్యర్థులు 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి,%హ్రస్ట్రం% లేదా %చీజు/రాజు%లి గాని అర్హత కలిగి ఉండాలని . బోధన అనుభవం గల వారికి మొదటి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు.ఆసక్తి గల అభ్యర్థులుజిరాక్స్ %ళూవర్‌వం% సర్టిఫికెట్స్‌తో తేది 15.03.2024 వరకు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ మధుసూదన్ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు.

## కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వే



**పానగల్ (మేజర్ న్యూస్):** మండల పరిధిలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కమ్యూనిటీ హెల్త్ అధికారి రామయ్య ఆధ్వర్యంలో వైద్య బృందం మంగళవారం కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ హెల్త్ అధికారి రామయ్య మాట్లాడుతూ ఈనెల 24వ తేదీ వరకు అన్ని గ్రామాలలో వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి కుష్టు వ్యాధిగ్రస్తులకు గుర్తింపు సర్వే కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందన్నారు. వ్యాధి మైకో బాక్టీరియం లేప్రే అనే వ్యాధికారక క్రిమి ద్వారా ఈ వ్యాధి వస్తుందని, కుష్టు వ్యాధి మచ్చలు సహజ చర్మం రంగు కంటే తక్కువ లేదా ఎరుపు లేదా రాగి రంగు కలిగి ఉంటాయని మచ్చపై స్పర్శ ఉండదని నొప్పి ఉండదన్నారు, శరీరంలో ఏ ప్రదేశంలో నైనా మచ్చలు రావచ్చని, మచ్చలపైన వెంట్రుకలు రాలిపోతాయని తెలిపారు, కుష్టు వ్యాధి ముఖ్యంగా చర్మానికి నరాలకు సోకుతుందని, కుష్టు వ్యాధి చాలా నెమ్మదిగా పెరిగే వ్యాధి, లక్షణాలు బహిర్గతం కావడానికి సగటున మూడు సంవత్సరాలు పడుతుందని తెలిపారు, వ్యాధి నిర్ధారణ జరిగిన వారికీ బహుళ ఔషధ చికిత్స, ఆరు నెలలు నుండి 12 నెలలు వాడితే వ్యాధి పూర్తిగా నయమవుతుంది, వ్యాధిగ్రస్తులు పూర్తి సామాజిక జీవితం గడపవచ్చని ఆయన తెలిపారు, కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ రాంచంధర్, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## చట్టాలపై అవగాహన కల్పించాలి : ఎస్ఐ నాగన్న



**దేవరకద్ర (కౌకుంట్ల )మేజర్ న్యూస్:** మహిళలు, విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించాలని దేవరకద్ర ఎస్సై నాగన్న అన్నారు. మంగళవారం దేవరకద్ర మండలంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(గర్ల్స్)లో నిర్వహించిన చట్టాలపై అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (గర్ల్స్) ప్రధానోపాధ్యాయురాలు మరియు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## నాగనూల్‌లో రెడ్ క్రాస్ సంచార వైద్య సేవలు



**నాగర్కర్నూల్ ఎడ్యుకేషన్ మేజర్ న్యూస్ :** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నాగర్ కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో నేడు పెద్దముద్దునూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిదిలోనీ నాగనూల్ గ్రామంలో సంచార వైద్య సేవలు అందించారు. జిల్లా సెక్రెటరీ రమేష్ రెడ్డి మాట్లడుతూ నాగనూల్ గ్రామంలో నీ వృద్దులకు నేడు వైద్య శిభిరం నిర్వహించడం జరిగిందని ఈ శిబిరంలో 60 ఏళ్లకు పైబడిన 78 మంది వృద్దులకు వైద్య సేవలు అందించడం జరిగిందని, కొత్తగా ఇద్దరికి మధుమేహం బాధపడుతున్నట్లు నిర్ధారించి ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేయడం జరిగిందన్నారు. ఈ ఆరోగ్య శిబిరంలో పరీక్షలు చేసి అవసరమైన వారికి హైపర్ టెన్షన్, డయాబెటిక్ మందులు మరియు మల్టీవిటమిన్, కాల్షియం టానికులు, కంటి చుక్కల మందులు అందించడంతో పాటు ఆరోగ్యపరంగా తీసుకోవలసిన పలు జాగ్రత్తలను తెలియజేశారు. ఈ క్యాంపులో జిల్లా యూత్ రెడ్ క్రాస్ జిల్లా కన్వీనర్ డి. కుమార్, పర్యవేక్షణా అధికారి కేశవులు, ఏ.ఎన్. ఎమ్. కవిత, ఆశా కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## పాఠశాలలో విద్యార్థులే ఉపాధ్యాయులైనవేళ



**శ్రీరంగాపూర్ మేజర్‌న్యూస్:** తాటిపాముల ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులే ఉపాధ్యాయులై ఘనంగా స్వయంపరిపాలన దినోత్సవం నిర్వహించారు. ధరణి కుమార్ ప్రధానోపా ధ్యాయులుగా వ్యవహరించగా హారిక మండలవిద్యాధికారిగా వ్యవహరించి ప్రతి తరగతి గదిని సందర్శించి ఉపాధ్యాయుల బోధనను పరిశీలించారు. అత్యుత్తమ బోధన అందించిన ఉపాధ్యాయులకు బహుమతులు అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామచంద్రయ్య, ముఖ్యఅతిథులు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రాములు యాదవ్ , సింగిల్ విండో డైరెక్టర్ వాసుదేవ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు కురుమన్న, గ్రామ మాజీ సర్పంచ్ సత్యనారాయణ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎల్లస్వామి, మద్దిలేటి, ఉషన్, పాఠశాల ఉపాధ్యాయులు శేఖర్ రెడ్డి, రేణుక, మాధవి లత, రాజు, రవి, శ్రీరంగాపూర్ మండల సముదాయ పరిధిలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు బాలంజనేయులు, సాయి, స్వీపర్ బాలస్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.

## రెండు రోజులుగా మద్యం లిఫ్టింగ్ బంద్

**తిమ్మాజిపేట మేజర్‌న్యూస్:** మద్యం వాహనాలకు సంబంధించి కొన్నాళ్లుగా వాణిజ్య పన్నులశాఖ, ఎక్సైజ్ శాఖల మధ్య నెలకొన్న 'ఈ-వేబిల్లుల' వివాదం చివరికి రాష్ట్ర ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టేలా చేసింది. డిపోల నుంచి మద్యం రవాణా వాహనాలు బయటకు రాగానే ఈ-వేబిల్లులు లేవంటూ వాహనాలను వాణిజ్య పన్నుల అధికారులు సీజ్ చేస్తుండటంతో రెండు రోజులుగా వైన్ షాప్ ఓనర్లు మద్యం లిఫ్టింగ్ నిలిపివేసి, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో వైన్ షాపులు, బార్ల ఓనర్లు ఎక్సైజ్ శాఖ ఆధీనంలోని మద్యం డిపో నుంచి మద్యంని లిఫ్ట్ చేస్తుంటారు. ఈ డిపోల నుంచి వ్యాన్లు, ఇతర పెద్ద వాహనాల ద్వారా తమవైన్ షాపుల వరకు తీసుకెళ్తుంటారు. అయితే మద్యం రవాణా వాహనాలకు 'ఈ-వేబిల్లులు' ఉండాల్సిందే నంటూ వాణిజ్య పన్నుల శాఖ పట్టు బడుతుం డగా.. అవసరం లేదని ఎక్సైజ్ శాఖ శనివారం నుంచి ఈ వ్యవహారం ఎటూ తేలక పోవడంతో ఎక్కడిక క్కడ వాణిజ్య పన్నుల శాఖ అధికారులు మద్యం రవాణా వాహనాలను సీజ్ చేస్తున్నారు. మద్యంతో కూడిన వ్యాన్లను పోలీస్ స్టేషన్లలో పెట్టేస్తున్నారు. దీంతో సోమవారం, మంగళవారం వైన్ షాప్ ఓనర్లు మద్యం తీసుకు వెళ్లడం నిలిపేశారు. మద్యం గోదాంల నుంచి ఇతర జిల్లాలో శనివారం మద్యాన్ని తీసుకువెళ్తున్న హనాలను సీజ్ చేయ డంతో విషయం రాష్ట్రవ్యాప్తంగా పాకడంతో మద్యాన్ని తీసుకువెళ్లడానికి ఎవరు సాహసించడం లేదు. దీంతో గత రెండు రోజులుగా మద్యం షాపుల్లో స్టాక్ అయిపోవడంతో మద్యం షాపుల యజమానులు ఎటు తోషక తిమ్మాజీపేట మద్యం గోదాకు వచ్చి వాహనాలను ఇక్కడే నిల్పివేశారు. సమస్య పరిష్కారం అయ్యేవరకు మద్యాన్ని తీసుకువెళ్లా బొమ్మని మద్యం షాపుల యజమానులు తెలిపారు. దీంతో తిమ్మాజిపేటలో మధ్యానంలో మద్యాన్ని తీసుకువెళ్లడానికి వచ్చిన వాహనాలు భారీగా నిలిచిపోయాయి.

## నేటి నుంచి పర్వతాపూర్ మైసమ్మ దేవాలయ వార్షికోత్సవాలు

**నవాబ్ పేట మేజర్ న్యూస్..** నవాబ్ పేట మండలం పరిధిలోని కాకర్ల పహాడ్ గ్రామ సమీపంలో ఉన్న పర్వతాపూర్ మైసమ్మ దేవాలయ వార్షికోత్సవాలు ప్రారంభం అవుతాయి అని ఆలయ కార్యనిర్వహణాధికారి మధన్ ఈశ్వర్ రెడ్డి చైర్మన్ కృష్ణయ్య తెలిపారు.ఈ సందర్భంగా బుధవారం ఉదయం ధ్వజారోహణం, గణపతి పూజ చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయడం జరిగుతుందని అని అన్నారు.భక్తులు వార్షికోత్సవాలలో పాల్గొని అమ్మవారి సేవలలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## రాష్ట్ర హ్యాండ్ బాల్ జట్టుకు జడ్చర్ల యువతి పాత్లవత్ రోజా సారథ్యం

### - అభినందించిన జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్



**జడ్చర్ల మేజర్ న్యూస్:** తెలంగాణ రాష్ట్ర హ్యాండ్ బాల్ మహిళా జట్టుకు మహబూబ్నగర్ జిల్లా జడ్చర్ల కు చెందిన పాత్లవత్ రోజా కెప్టెన్‌గా ఎంపిక అయ్యారు. ఇటీవల కరీంనగర్ జిల్లాలో జరిగిన హ్యాండ్ బాల్ సీనియర్ ఉమెన్ ఛాంపియన్ షిప్‌లోమహబూబ్నగర్ జిల్లా హ్యాండ్ బాల్ జట్టుకు రోజా కెప్టెన్ గా సారథ్యం వహించారు. జట్టులో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి హ్యాండ్ బాల్ జట్టుకు ఎంపిక అయింది. ఈ మేరకు రోజా ప్రతిభను గుర్తించిన తెలంగాణ రాష్ట్ర హ్యాండ్ బాల్ అసోసియేషన్ రోజాను రాష్ట్ర మహిళా జట్టుకు కెప్టెన్ గా ప్రకటించింది. ఈనెల 16 నుండి 20 వరకు దాద్రా నగర్ హవేలీలో నిర్వహించనున్న జాతీయస్థాయి మహిళల హ్యాండ్ బాల్ పోటీలకు పాత్లవత్ రోజా సారథ్యం వహించనుండడం గమనార్హం. రోజాది మహబూబ్నగర్ జిల్లా జడ్చర్ల మండలం మక్తపల్లి గ్రామం. ఆమె తండ్రి హర్యా ఓ నిరుపేద రైతు కావడం గమనార్హం. ఇదిలా ఉండగా రోజాను హ్యాండ్ బాల్ అసోసియేషన్ మహబూబ్నగర్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బాలత్రిపుర సుందరిరెడ్డి, పి.శంకర్‌నాయక్ అభినందించారు.

## మల్టీ జోన్2లో వెంటనే ప్రధానోపాధ్యాయుల పదోన్నతులు చేపట్టాలి

### - తపస్ రాష్ట్ర అధ్యక్షులు హనుమంతరావు



**మహబూబ్‌నగర్ విద్యా విభాగం మేజర్‌న్యూస్:** తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన జిల్లా కార్యనిర్వాహక సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు హనుమంతరావు మాట్లాడుతూ ,కోర్టు నుండి సానుకూలమైనటువంటి నిర్ణయం వచ్చింది కనుక ఇక ఎంత మాత్రం తాత్సారం చేయకుండా వెంటనే గజిటెడ్ ప్రధానోపాధ్యాయులకు పదోన్నతులు చేపట్టాలని అలాగే వీటితోపాటు అన్ని క్యాడర్లకు పదోన్నతులు బదిలీలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. కేజీబీవీ సిబ్బందికి మినిమం టైంస్కేల్ ఇవ్వాలని అలాగే మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు పదోన్నతులు బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మహిళా ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న విధంగానే రెండు సంవత్సరాల చైల్డ్ కేర్ లీవ్ ఇవ్వాలని అది కూడా వారి సర్వీస్ మొత్తంలో ఎప్పుడు అయినా వినియోగించుకునే అవకాశం ఇవ్వాలని కోరారు. పిఆర్సి కమిటీ కూడా గతంలోలా కాకుండా సాధ్యమైనంత త్వరగా పిఆర్సి అమలు చేసే విధంగ చూడాలని కోరారు. 317 జీవో బాధితులకు సత్వర న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బొల్లం సునీల్ కుమార్ ,గడ్డం బాబు నాయుడు, రాష్ట్ర బాధ్యులు శ్రీనివాస్ గౌడ్ ,కర్ణాకర్ గౌడ్, జిల్లా కోశాధికారి రాజమోహన్ రెడ్డి వివిధ మండలాల అధ్యక్ష కార్యదర్శులు రాష్ట్ర జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలు చెల్లించాలని

### ఎంపిడిఓ కార్యాలయం ముందు ధర్నా



**చిన్న చింతకుంట మేజర్ న్యూస్:** మండల కేంద్రం లోని వివిధ గ్రామ పంచాయతీల కార్మికులు గత నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదంటూ మంగళవారం ఎంపిడిఓ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఐ ఎఫ్ టి యు అధ్యక్షులు జె ఎన్.దేవదానం మాట్లాడుతూ గ్రామపంచాయతీ సిబ్బందిని పర్మనెంట్ చేయాలని, తమ వేతనాలను ప్రత్యేక బడ్జెట్ లో కేటాయించాలని, ఒకటవ పిఆర్సి నిర్ణయించిన 30% వేతనాలు గ్రామపంచాయతీ వేతనాలు అమలు చేయాలని, జీవో నెంబర్ 51ని సవరించాలని, మల్టీ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలని, గత నాలుగు నెలల నుంచి వేతనాలు చెల్లించడం లేదని శానిటైజర్ సబ్బులు నూనెలు దుస్తులు ఇవ్వాలని వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎంపిడిఓ సుధాకర్ రెడ్డి ఎంపీ ఓ అనిల్ కుమార్ కు పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టియు జిల్లా ఉపాధ్యక్షులు కోళ్ల వెంకటన్న . జిల్లా నాయకులు అరుణోదయ సాంగ్స్ సమైక్య రాష్ట్ర నాయకులు చంద్రన్న తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీల వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి సాంబశివుడు. విన్ను. గోపాల్ శ్రీను కురుమన్న లాజర్ అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## నాగర్‌కర్నూల్‌కు నరేంద్ర మోడీ రాక ఏర్పాట్లను పరిశీలించిన నేతలు



**నాగర్ కర్నూలు, మేజర్ న్యూస్ :** ఈ నెల 16 నా నాగర్ కర్నూల్ కు ప్రధాని నరేంద్ర మోడీ రాక పార్లమెంటు ఎన్నికల ప్రచార సభ బిజెపి అభ్యర్థి పోతుగంటి భరత్ కు మద్దతుగా ఎన్నికల ఏర్పాటు కోసం కొల్లాపూర్ చౌరస్తా వద్ద మైదానాన్ని పరిశీలించిన మాజీ బీసీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి ఆచారి డిసిసిబి డైరెక్టర్ జక్క రఘునందన్ రెడ్డి బిజెపి జిల్లా అధ్యక్షులు ఏలేని సుధాకర్ రావు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దిలీప్ వనపర్తి జడ్పీ చైర్మన్ లోక్నాథ్ రెడ్డి పాల్గొన్నారు.

## అన్ని రంగాలలో మహిళలు ముందున్నారు

### - జిల్లా యువజన అధికారి కోటా నాయక్



**మహబూబ్‌నగర్ విద్యావిభాగం మేజర్ న్యూస్:** అన్ని రంగాలలో మహిళలు ముందున్నారు అని జిల్లా అధికారి కోటా నాయక్ అన్నారు. మంగళవారం ఎన్టీ ఆర్ డిగ్రీ మహిళా కళాశాల లో "నారి శక్తి ఫిట్నెస్" కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా బాలికలకు "ఫిట్నెస్ రన్" పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సాహంగా బాలికలు పాల్గొన్నారు. అనంతరం విజేతలుగా నిలిచిన బాలికలకు ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో జిల్లా యువజన అధికారి కోటా నాయక్ మాట్లాడుతూ, మహిళలు శక్తివంతులు అనుకుంటే ఎలాంటి రంగాల్లో అయినా విజయం సాధిస్తారని, మహిళల శారీరక దృక్పథం పెంపొందించుటకు ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం విజయకుమార్, ఎన్సిసి అధికారి రాజేశ్వరి ,ఎన్వైకే ప్రతినిధులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## పిఆర్ టియు తెలంగాణ జిల్లా సభ్యునిగా రవికుమార్ : ఎస్జీటి, పిఎస్ సిద్దోటం



**నవాబ్‌పేట మేజర్‌న్యూస్:** మహబూబ్నగర్ జిల్లా పీఆర్టీయు తెలంగాణ ఉపాధ్యాయుల సంఘం జిల్లా కమిటీ సభ్యులుగా సిద్దోటం ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఎస్జీటీ రవికుమార్ ను నియమిం చినందుకు మండల అధ్యక్ష కార్యదర్శులు శ్యాంసుందర్ రెడ్డి, నసీర్ అహ్మద్ లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ సంఘాన్ని పటిష్టం చేస్తూ ఉపాధ్యాయ సమస్యలపై పోరాడుతానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపతి సింగ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రమాకాంత్ తదితర సభ్యులు పాల్గొన్నారు.

## ప్రసూతి సెలవులను 240 రోజులకు పెంచాలి

### - పిఆర్‌టియు తెలంగాణ మహిళా కార్యదర్శి సునీత



**నవాబ్‌పేట మేజర్‌న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వం మహిళా ఉద్యోగులకు ఇస్తున్నటువంటి ప్రసూతి సెలవులను 180 నుండి 240 కి పెంచాలి. అదేవిధంగా శిశుపోషణకై ఇస్తున్నటువంటి చైల్డ్ కేర్ లీవ్లను (సిసిఎల్) 90 నుండి 180కి పెంచి, వాటిని వినియోగించుకునే నియమ నిబంధనలో కూడా మార్పులు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

## ఇంటిగ్రేషన్ క్యాంపుకు ఎంపికైన ఎంవిఎస్ విద్యార్థి



**మహబూబ్‌నగర్ విద్యావిభాగం మేజర్‌న్యూస్:** కేంద్ర యువజన క్రీడలు శాఖ వారు కర్నాటక రాష్ట్రంలోనీ గడగ్ లో నిర్వహించే నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంప్ కు స్థానిక యంవియస్ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలకు చెందిన యన్. యస్ .యస్ యూనిట్ -6 చెందిన ఇ, శ్రావణ్ ఎ%శీ%పికయ్యారని కళాశాల ప్రై సిపల్ డా.కె.పద్మావతి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే పద్మావతి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం నిర్వహించే వివిధ సేవ కార్యక్రమాల్లో వాలంటీర్స్ ఎక్కువ సంఖ్యలో పాల్గొని కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే పద్మావతి,యన్ యస్ యస్ అధికారీ రాఘవేంద్ర రెడ్డి మరియు అధ్యాపకులు అభినందనలు తెలియజేశారు.

# వరి రైతులను ఆదుకోవాలి

### - పరిహారం చెల్లించేందుకు చర్య తీసుకోవాలి - జడ్పీ వైస్ చైర్మన్ కోడ్గల్ యాదయ్య





**జడ్చర్ల మేజర్‌న్యూస్:** భూగర్భ జలాల అడుగంటి ఎండుతున్న వరి పంటలకు ప్రభుత్వం పరిహారం ప్రకటించాలని, వరి రైతులను ఆదుకోవాలని మహబూబ్ నగర్ జిల్లా జడ్పీ వైస్ చైర్మన్ కోడ్గల్ యాదయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జడ్చర్ల మండల పరిధిలోని గైరాన్ తండాకు చెందిన రైతు శంకర్, హర్యానాయక్ లకు చెందిన వరిపంట చేనును మంగళవారం ఆయన పరిశీలించారు. నీళ్లు లేక బీటలు వారిన వరి పంటను చూసి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది వర్షాభావం కారణంగా నీళ్లులేక భూగర్భజలాలు అడుగంటి పోయాయని అన్నారు. నాటిన చేలను కాపాడుకోవటానికి అప్పులు చేసి కోడుగల్ ప్రాంతంలో చుట్టు పక్కల రైతులు దాదాపు 200 బోర్లు వేసినప్పటికి బోర్లలోనీళ్ళు రాలేదన్నారు. కాస్తో కూస్తో నీళ్లు పడిన బోర్లు సైతం ప్రస్తుతం ఎండిపోవడంతో నాటుకున్న ఎకరా.. రెండెకరాల్లో సాగానికి పైగా పంట పొట్టకు వచ్చిన దశలో ఎండిపోతున్న పరిస్థితి నెలకొందన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి అధికారుల ద్వారా సర్వే నిర్వహించి ఎండిన వరి పంటకు పరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ మోహన్ నాయక్, మంజ్యానాయక్, తిరుపతి, నాగేష్ ఉన్నారు.

## సీసీ కెమెరాలు బయోమెట్రిక్ పెట్టాలనే నిర్ణయాన్ని తక్షణ ఉపసంహరించుకోవాలి

### - కలెక్టరేట్ ముందు అంగన్వాడీల ధర్నా



**పాలమూరు మేజర్ న్యూస్ :** అంగన్వాడీ కేంద్రాల్లో బయోమెట్రిక్,సీసీ కెమెరాలు పెట్టాలని నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని సిఐటి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ కురుమూర్తి డిమాండ్ చేశారు. మంగళవారం అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి మాట్లాడుతూ అంగన్వాడీలను దొంగలుగా చిత్రీకరిస్తూ, అంగన్వాడి కేంద్రాల్లో సీసీ కెమెరాలు బయోమెట్రిక్ పెట్టాలనే నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలకు ఒకపూట బడితోపాటు, మే నెల అంతా టీచర్స్ కు హెల్పర్స్ కు సెలవులు ఇవ్వాలని, పనిచేయని సెల్ఫోన్లను తిరిగి వాపస్ తీసుకోవాలని, కొత్త 5జి ట్యాబులు సరఫరా చేయాలనన్నారు.గత ప్రభుత్వంలో 24 రోజుల సమ్మె సందర్భంగా జీతాలు చెల్లిస్తామన్న హామీని అమలు చేయాలని, అంగన్వాడి హెల్పర్లకు పాత పద్ధతిలోనే ప్రమోషన్స్ సౌకర్యం కల్పించాలని, ప్రమోషన్ వయసు 50 సంవత్సరాలకు పెంచాలనారు.ఆన్లైన్ సమస్యల వల్ల ఆగిపోయిన వారికి వెంటనే వేతనాలు చెల్లించాలని, సెంటర్ అద్దెలు, గ్యాస్ బిల్లులు, ఆరోగ్యలక్ష్మి మెనూ చార్జీలు తదితర పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని, పిఆర్సి ఏరియార్స్ 2021 జులై అక్టోబర్ నవంబర్ 3 మాసాలవి వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలపై తక్షణమే ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టరేట్ ఏవో శంకర్ కు అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ కన్వీనర్ రాజ్ కుమార్, ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు సరోజ ఉపాధ్యక్షురాలు ప్రభావతి ,రాజ్యలక్ష్మి గౌస్య బేగం, పద్మ, కవిత ,కమల పాల్గొన్నారు.

## కనీస పెన్షన్ పెంపుకు ఇక ఆమరణదీక్ష ఒక్కటే శరణ్యం

### - జాతీయ సంఘర్షణ సమితి అధ్యక్షుడు రాజసింహుడు




**పాలమూరు మేజర్‌న్యూస్:** ఆర్టీసి,ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ఈపీఎస్ పెన్షనర్ల కనీస పెన్షన్ పెంపుదలకు ఇక ఆమరణదీక్ష ఒక్కటే మిగిలిందని ఆర్టీసీ,ఈపీఎస్ పెన్షనర్ల జాతీయ సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు రాజసింహుడు అన్నారు.మంగళవారం స్థానిక టీటీడీ కళ్యాణ మండపం దగ్గర ఆర్టీసీ, ఈపీఎస్ పెన్షనర్లు నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.గత అనేక సంవత్సరాలుగా పిఎఫ్‌పై వస్తున్న కనీస పెన్షన్ కరువు భత్యంతో 7500 రూపాయలకు పెంచాలని,పెన్షనర్ల భార్యాభర్తలకు ఉచిత వైద్య సౌకర్యాలు కల్పించాలనే తదితర డిమాండ్ల సాధనకై తీవ్రస్థాయిలో ఆందోళనలు నిర్వహించామని, ఇక ఆమరణదీక్ష లతో ఆత్మత్యాగాలకు సిద్ధమయ్యామని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. దేశంలో మౌలిక సదుపాయాల కల్పన కోసం కేంద్ర ప్రభుత్వం తమ పీఎఫ్ డబ్బులను లక్షల కోట్ల రూపాయలను కేటాయించడం అన్యాయమని ఆయన అన్నారు.పార్లమెంటు ఎన్నికల ప్రవర్తనా నియమావళికి ముందే కనీస పెన్షన్ పెంపుపై ప్రకటన చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జిబి పాల్,ఉమేష్ కుమార్,ఆర్ నారాయణ, మనోహర్, నాగాంజనేయులు, జెఎన్ రెడ్డి, బస్వరాజ్, సుల్తాన్, డేవిడ్ తదితర విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

## విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు : డిటిడిఓ కమలాకర్ రెడ్డి



**లింగాల, మేజర్‌న్యూస్:** చదువుకోవాలని కోరిక బలంగా ఉన్నప్పుడు ఎంతటి ఉన్నత లక్ష్యాన్నైనా సులభంగా సాధించవచ్చునని, చదువుకు పేదరికం అడ్డు ఆటంకం కాదని, విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి (డీటీడీవో) కమలాకర్ రెడ్డి అన్నారు. మంగళవారం లింగాలలోని గిరిజన బాలుర వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.అనంతరం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలోని తరగతి గదులను, పరిసరాలను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థినుల విద్యా ప్రమాణాల స్థాయిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి భయాందోళనలకు లోను కాకుండా విద్యార్థులు పరీక్షలను పండుగల భావించి సంతోషంగా ఉంటూ ఏకాగ్రతతో పరిశ్రమలు రాసి ప్రతిభను చాటుకోవాలని సూచించారు. ప్రణాళిక బద్ధంగా చదువుకొని మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు.సమీపిస్తున్న పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయడంలో భాగంగా గిరిజన వసతి గృహాలు ఆశ్రమ పాఠశాలలో ప్రేరణ తరగతులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఆశ్రమ పాఠశాలలు, గిరిజన సంక్షేమ వసతి గృహాల్లోని పదవ తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతుల గురించి అడిగి తెలుసుకున్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని బోధనా సిబ్బందికి సూచించారు. స్థానికంగా సబ్జెక్టుల వారీగా పరీక్షలు నిర్వహించి విద్యార్థులు ఎక్కడ తప్పులు చేస్తున్నారో గుర్తించి సరిచేయాలని ఆదేశించారు. ఎక్కువ మంది విద్యార్థులు పది గ్రేడ్ పాయింట్లు సాధించేలా బోధన చేయాలన్నారు. విద్యార్థులు వ్యక్తిగత ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, సంపూర్ణంగా ఆరోగ్యంగా ఉంటూ పరీక్షలకు సన్నద్ధం కావాలని అన్నారు. విద్యా ప్రమాణాలను పెంపొందించేందుకు గిరిజన వసతి గృహాలు, గిరిజన ఆశ్రమ పాఠశాలలో కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను చదువులో రాణించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎసియంఓ తిరుపతయ్య, పాఠశాల హెచ్ఎం మాసమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఆడపిల్లలు అన్ని రంగాలలో రాణించాలి




**మక్తల్, మేజర్ న్యూస్:** మహిళ భివృద్ధి మరియు శిశు సంక్షేమా శాఖ, బేటి బచవో - బేటి పడావో అధ్వర్యంలో మక్తల్ మండలం మైనార్టీ కాలనీలో మైనార్టి కమ్యూనిటి వారితో అవగహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగింది. బేటి బచవో బేటి పడావో పథక%శీ% ముఖ్య ఉద్దేశ్యం ఆడపిల్లలను చదివించడం వారిని ఎదగనిద్దాం అని అమ్మాయిలను పుట్టానివ్వలి. అన్ని రంగాలలో రాణించాలి అని చెప్పడం జరిగింది. ఎవరు కుడా చిన్న వయసులో వివాహాలు చేయరాదు చేసే వారిని కుడా ప్రోత్సహించ రాదని చెప్పడం జరిగింది. బి.బి.బి.పి, మెంటర్ రేణుక జెండర్ స్పెషలిస్ట్ అనిత ముస్లిం పెద్దలు ఖాజీ. మహ్మద్ సాధిక్ మట్లాడుతూ. మా పిల్లల చదువు కోసం తగిన ఎర్పాట్లు చెయ్యాలని మైనార్టీ కాలనీ ప్రాంతంలో పిల్లలకు ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రలను ఏర్పాటు చేసి అన్ని రంగాలలో కుడా మా కమ్యునిటి పిల్లలను తీసుకురావడానికి మేము సహకరిస్తాం అని అన్నారు. అమీన్ బెగం సోఫియా బేగం రిజ్వానా బేగం కౌసర్ బేగం సాధియ బేగం పాతీమా సోఫీయ బేగం పిల్లలు మరియు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## 16న జరిగే ఎమ్మార్పీఎస్ సమావేశం సదస్సు ను విజయవంతం చేయండి



**కౌకుంట్ల మేజర్ న్యూస్:** కౌకుంట్ల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఎమ్మార్పీఎస్ నాయ కుల సమావేశం ఏర్పాటు చేసుకొని, ఈనెల 16న మహబూబ్నగర్లో స్థాయి సమీక్ష పార్లమెంటు సదస్సుకు మంద కృష్ణ మాదిగ వస్తున్న సందర్భంగా పెద్ద ఎత్తున పాల్గొని విజ యవంతం చేయుటకు వివిధ ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల నాయకులు, పెద్ద ఎత్తున తరలిరా రావాలని పిలుపునిచ్చారు. ఎంఈఎఫ్ జాతీయ నాయకులు, పోలే మాదిగ బాలయ్య, జిల్లా అధ్యక్షులు ఎం శ్రీనివాసులు, మరియు కౌకుంట్ల ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రభాకర్ మాదిగ, బెందుల కృష్ణయ్య మాదిగ, మన్యం, శ్రీనివాసులు, రమేష్ నారాయణ పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలు చెల్లించాలని తాహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా



**కౌకుంట్ల మేజర్ న్యూస్:** కౌకుంట్ల మండల కేంద్రంలో ని వివిధ గ్రామ పంచాయతీల కార్మి కులు గత నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదంటూ మంగళవారం కౌకుంట్ల తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. జిల్లా ఐఎఫ్టియు కార్యదర్శి సాంబశివుడు మాట్లాడుతూ గ్రామపంచాయతీ సిబ్బందిని పర్మనెంట్ చేయాలని, తమ వేతనాలను ప్రత్యేక బడ్జెట్ లో కేటాయించాలని, ఒకటవ పిఆర్సి నిర్ణయించిన 30% వేతనాలు గ్రామపంచాయతీ వేతనాలు అమలు చేయాలని, జీవో నెంబర్ 51ని సవరించాలని, మల్టీ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలని, వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కౌకుంట్ల తహసిల్దార్ ఎల్లయ్యకు అందజేశారు. వివిధ గ్రామ పంచాయతీల కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## పది విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు



**మిడ్జిల్ మేజర్న్యూస్:** విద్యార్థి జీవితంలో పాఠశాల విద్య అత్యంత కీలకమైనదని హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు సరస్వతి అన్నారు. మంగళ వారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి జీవితంలో అత్యంత కీలకమైన మలుపు పదవ తరగతితోనే ప్రారంభం అవుతుందని అన్నారు. ఆనవాయితీగా పాఠశాల స్థాయిలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు పదవ తరగతి చదువుతూ పాఠశాలను విడిచి వెళ్లే విద్యార్థులను అభినందిస్తూ వీడ్కోలు సభ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఉపా ధ్యాయులు ఆశీర్వదించారు కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేందర్ గౌడ్ శ్రీశైలం పరశురాములు స్వర్ణలత అరుణ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# ఢిల్లీలో కాషాయ జెండాను ఎగురవేస్తాం

### - మండల బిజెపి అధ్యక్షులు యాదగిరి సలేశ్వరం - విజయ సంకల్ప సమ్మేళనంకి బయలుదేరిన బిజెపి శ్రేణులు



**లింగాల, మేజర్ న్యూస్:** రాబోయే జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో అఖండ విజయం సాధించి ఢిల్లీలో కాషాయ జెండాను ఎగురవేస్తామని మండల బిజెపి అధ్యక్షులు యాదగిరి సలేశ్వరం అన్నారు. మంగళవారం హైదరాబాదులోని ఎల్బీ స్టేడియంలో కేంద్ర హెూం మంత్రి అమిత్ షా పాల్గొని విజయ సంకల్ప సమ్మేళనానికి ప్రత్యేక బస్సులో మండలంలోని వివిధ గ్రామాల్లోని బూతు స్థాయి అధ్యక్షులు, శక్తి కేంద్రాల ఇన్చార్జులు, వివిధ మోర్చాల అధ్యక్షులు, బిజెపి నాయకులు లింగాల నుండి తరలి వెళ్లారు. ఆయన మాట్లాడుతూ దేశంలోనే అతి పెద్ద పార్టీ అయినా బిజెపితోనే దేశములో సమర్థవంతమైన, సుపరిపాలన సాధ్యమని అన్నారు. ప్రధాని మోడీ మూడవ పర్యాయం పీఎం చేయడం లక్ష్యంగా తెలంగాణ రాష్ట్రంలోని బిజెపి పార్లమెంట్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయడానికి విజయ సంకల్ప సమ్మేళనంలో కేంద్ర హెూం శాఖ మంత్రి అమీషా దిశ నిర్దేశం చేయనున్నట్లు వెల్లడించారు. బూత్ స్థాయి నుంచి బిజెపిని ప్రతిష్టపరిచి దేశంలో మరోసారి బిజెపి ప్రభుత్వం ఏర్పడే విధంగా ప్రతి ఒక్కరూ సైనికుల కృషి చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. పిఎం సడక్ యోజన ద్వారా గ్రామీణ విస్తారమైన రోడ్ల నిర్మాణం, గ్రామాలు పట్టణాలలో వేస్తున్న సిసి రోడ్లు, డ్రైనేజీలు పూర్తిగా కేంద్ర నిధులను అన్నారు. సిగ్రీ గేషన్ షెడ్, పల్లె ప్రకృతి వనం పార్కులు ,రైతు వేదికలు, వైకుంఠధామాలు, హరితహారం స్కీములు పూర్తిగా కేంద్రం ఇస్తున్న నిధులతోనే గ్రామీణ అభివృద్ధి జరుగుతున్నదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండ కట్టాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ఎప్పటికప్పుడు ప్రజల్లో తీసుకెళ్లి త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో నాగర్ కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి విజయం సాధించే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు.

## చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలి



**నారాయణపేటటౌన్ మేజర్న్యూస్ :** పురుషులతో పాటుగా సమాన పనికి సమాన వేతనము మహిళలకు ఇవ్వాలి. వరకట్న నిషేధపు చట్టాన్ని పకడ్బందీగా అమలుపర చాలి. దేశంలో నిత్యము మహిళలపై జరుగుతున్నదాడులు దౌర్జన్యాలు హత్యలు హత్యాచారాలను అరికట్టాలని ఐద్వారాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి డిమాండ్ చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అఖిల భరత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా), తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా నాయకురాలు అమృతమ్మ అధ్యక్షతన స్థానిక సిటిజన్ క్లబ్ ఆవరణలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకోవడం జరిగింది. కామ్రేడ్ అరుణజ్యోతి మాట్లాడుతూ 1909 ఫిబ్రవరి 28వ తేదీన అమెరికా దేశంలో అమెరికా రాజధాని నడిబొడ్డున వేలాది మంది మహిళలకు రాజకీయ హక్కు కావాలని నిరసన ప్రదర్శనలు చేయడం జరిగింది. ఈ నిరసన కార్యక్రమాలు జర్మనీ, ఫ్రాన్స్, ఇంగ్లాండ్, ఆస్ట్రియా తదితర దేశాలకు వేగంగా విస్తరించాయి. మహిళలకు రాజకీయ హక్కులు కావాలని, జనాభాలో సగం బాగం ఉన్న స్త్రీలకు ఓటు హక్కు కావాలని సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, మహిళలను రెండవ పౌరులుగా చూడకూడదని తదితర మహిళ హక్కుల డిమాండ్ కై నాడు ప్రపంచవ్యాప్తంగా జరిగిన నిరసన కార్యక్రమాలు, ఆందోళన, పోరాటాల నుంచే 1911 మార్చి 19న తొలి అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకోవడం జరిగింది. భారతదేశంలో వరకట్న నిషేధ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి, మహిళలపై జరుగుతున్న హత్యలు అత్యాచారాలను అరికట్టాలని, మరియు అన్ని రంగాలలో మహిళా మణులు ముందుకొస్తున్న ఈ తరుణంలో భారతదేశంలో పార్లమెంటు మరియు శాసనసభలలో 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో లలితమ్మ,జయంతి, దానమ్మ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్ , సిఐటియుజిల్లా అధ్యక్షులు వెంకట్రామారెడ్డి, బాల్ రామ్, జోశి,దస్తప్ప, పాల్గొనడం జరిగింది.

## జాబ్ కార్డ్ కలిగిన ప్రతిఒక్కరూ ఉపాధి పనులు చేయాలి : ఎంపిడిఓ ఆంజనేయులు



**లింగాల, మేజర్ న్యూస్:** ఈజీఎస్ జాబ్ కార్డు కలిగిన ప్రతిఒక్కరూ ఉపాధి పనులు చేసి లబ్ధి పొందాలని మండల అభివృద్ధి అధికారి ఆంజనేయులు అన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లో బాగంగా మంగళవారం మండల కేంద్రమైన లింగాలలో ల్యాండ్ లెవలింగ్ పనులను ఆయన పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలసల నివారణకోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈజీఎస్ పనులను సద్వినియోగపరుచు కోవాలని ప్రయోజన పొందాలని అన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారంగా పనులు కొనసాగే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామలలో ప్రతి రోజు హాజరైన కూలీల వివరాలు రోజు వారి కంప్యూటర్ లో నమోదు చేయాలనీ ఆదేశించారు. కూలీలు సంఖ్యను పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిఓ కర్ణా నాయక్. ఏపిఓ ఇమామ్ అలీ. ఈసి శ్రీనివాస్, టీఏ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే మేఘా రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం



**రేవల్లి మేజర్ న్యూస్ :** సోమవారం రోజు భద్రాచలం లో జరిగిన భారీ బహిరంగ సభలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం పేదలకు ఐదు లక్షలు పథకాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ప్రతి పేదవాడు ఖాళీ స్థలం ఉన్నవాళ్లు ఇల్లు నిర్మించుకోవచ్చు.గత టిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో నిరుపేదలు ఇల్లు లేకుండా చాలా ఇబ్బందులు పడ్డారు.ఇప్పుడు ఉన్న కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ప్రతి పేదవానికి ఇల్లు నిర్మించుకోవడానికి అవకాశం కల్పించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి మండలం లోని కేశంపెట గ్రామ వాసులు అంత కలిసి మంగళవారం రోజు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వనపర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే తూడి మేఘ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా కాంగ్రెస్ నాయకులు బాధపెల్లి సురేష్ గౌడ్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగిరెడ్డి, ప్రధాన కార్యదర్శి నాగ శేషు యాదవ్, వెంకటయ్య గౌడ్, బంకల నరసింహ, రమేష్, నరేష్, శేఖర్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కమిషనర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన మున్సిపల్ వైస్ చైర్మన్



**వనపర్తి టౌన్, మేజర్ న్యూస్ :** నూతనంగా వచ్చిన మున్సిపల్ కమిషనర్ ను మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ వనపర్తి మున్సిపల్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసిన పుష్పగుచ్ఛం అందజేశారు. మంగళవారం స్థానిక కౌన్సిలర్స్ కాగితాల లక్ష్మీనారాయణ, బండారు కృష్ణ, నాగన్న తో కలిసి నూతనంగా వచ్చిన కమీషనర్ పూర్ణచందర్ ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ మాట్లాడుతూ... రానున్న ఎండాకాలంలో నీటి ఎద్దడి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వనపర్తి మున్సిపల్ పరిధిలోని శానిటేషన్ పై పరిసరాల పరిశుభ్రత పై ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని కోరారు. వనపర్తి పట్టణ ప్రజల మున్సిపల్ కౌన్సిలర్ల సహకారం సంపూర్ణంగా ఉంటుందని తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేషన్ విషయంలో రాజీ పడకుండా పనిచేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## మాజీమంత్రి నిరంజన్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలసిన బి.యస్.పి చీఫ్ ప్రవీణ్ కుమార్



**వనపర్తిటౌన్, మేజర్ న్యూస్:** బి.యస్.పి అధ్యక్షులు ఆర్. యస్. ప్రవీణ్ కుమార్ మంగళవారం మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో బి.ఆర్.యస్, బి.యస్.పి సంయుక్తంగా పోటీ చేస్తున్న సందర్భంగారాజకీయ పరిస్థితుల గురించి చర్చించారు. భావస్వారుప్యం భావాలు కలిగిన పార్టీలు కలిసి పనిచేయడం వల్ల ప్రజా ప్రయోజనాలకు అనుగుణంగా పని చేయడానికి ఆస్కారం ఉంటుందని అన్నారు. ఒకరికి ఒకరం సహకరించుకొని ఓట్ల మార్పిడి సంపూర్ణంగా జరిగే విధంగా ఇరు పక్షాలు కృషి చేదామని అన్నారు. సింగిరెడ్డి వాసంతి నిరంజన్ రెడ్డి దంపతులు ఆర్. యస్.ప్రవీణ్ కుమార్ దంపతులను శాలువాతో ఘనంగా సన్మానించారు.

## తెల్లరాళ్లపల్లి తండాను సందర్శించిన అధికారుల బృందం



**పానగల్(మేజర్ న్యూస్):** మండల పరిధిలోని తెల్ల రాళ్లపల్లి తండాను మంగళ వారం గ్రామ ప్రత్యేక అధికారి విద్యా సాగర్ రెడ్డి ఆధ్వర్యంలో అధికారుల బృందం సందర్శించారు. తండాలో నెలకున్న మంచి నీటి సమస్యపై స్థానిక గిరిజనులను అడిగి తెలుసుకున్నారు. సమస్యను పరిష్కారించేందుకు స్థానిక నాయకుల సలహాలు తీసుకున్నారు. అనంతరం మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ ను అధికారులు పరిశీలించారు, సంబంధిత ఆర్డబ్ల్యూఎస్ ఏఈ లక్ష్మి కుమార్ మాట్లాడుతూ రెండు మూడు రోజులు వాటర్ ట్యాంక్ ద్వారా మంచినీటి సరఫరా చేసి సమస్యను పరిష్కరిస్తామని స్థానికులకు హామీ ఇచ్చారు, కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నర్మధ,గిరిజన సంఘం నాయకులు బాలునాయక్, రాజు నాయక్ రవితేజ తదితరుల పాల్గొన్నారు.

## ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం




**ధరూర్ మేజర్‌న్యూస్:** మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించడం జరిగింది. 8,9,10 తరగతుల విద్యార్థులు కొందరు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. పాఠశాలలో ఉన్న కొన్ని సమస్యలను విద్యార్థులు స్వపరిపాలనలో గుర్తించి జిల్లా ఉన్నత అధికారులకు వ్రాత పూర్వకంగా నివేదించడం జరిగింది. బోధనలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు హెచ్ఎం మరియు పాఠశాల ఉపాధ్యాయులు కొన్ని ప్రోత్సహక బహుమతులు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమం లో విద్యార్థులు చురుకుగా పాల్గొన్నారు. హెచ్ఎం లుగా వంశీ మరియు అలేఖ్య ఎంఈఓగా జానకి షిరాజ్ డీఈవో గా దర్శల్లి అదనపు కలెక్టర్ గా సిధార్థ జిల్లా కలెక్టర్ గా రాఘవేంద్ర విద్యా శాఖ మంత్రిగా హినాయతుల్లా

## ఆర్థిక సాయం అందజేసిన ఎమ్మెల్యే మేఘారెడ్డి



**వనపర్తి టౌన్, మేజర్ న్యూస్ :** పట్టణంలోని 19వ వార్డులో మైబు తాపీ మేస్త్రి అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందాడు. 19వ వార్డుకు చెందిన పిడి జయనందం, ద్యారపోగు వెంకటేష్‌లు ఈ విషయాన్ని ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డికి తెలుపగా, వెంటనే స్పందించిన ఎమ్మెల్యే మృతుని కుటుంబానికి రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు లక్కాకుల సతీష్, వనపర్తి పట్టణ అధ్యక్షులు చీర్ల విజయ్ చందర్ , కౌన్సిలర్స్ వెంకటేశ్వర్లు, లక్ష్మీ రవి యాదవ్, ఓబీసీ పట్టణ అధ్యక్షులు బొంబాయి మన్నెంకొండ, సూరి, ఈఎస్ శ్రీనివాసులు, పి వెంకటేష్ ,సింగోటం నాయుడు, తిరుపతయ్యలు కలిసి మైబు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని వారు హామీ ఇచ్చారు.

# భూమి వేడెక్కుతుంది... డాక్టర్ కార్తీక్ గాంధే





**నారాయణపేట్‌టౌన్ మేజర్‌న్యూస్:** ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు రోజు రోజుకీ పెరిగిపోతూనే ఉన్నాయి. భూగోళ ఉష్ణోగ్రతలు ఇప్పుడున్నంత ఎక్కువగా ఎప్పుడూ లేవు, 1880 నుండి, సగటు ప్రపంచ ఉష్ణోగ్రతలు సుమారు 1 డిగ్రీల సెల్సియస్ (1.7ళీ డిగ్రీల ఫారెన్‌హీట్) పెరిగాయి. భూమి ఎందుకు వేడెక్కుతోంది? వాహనాల ద్వారా విడుదలయ్యే కాలుష్య కారకాలు, పరిశ్రమలు ప్రత్యేకంగా కార్బన్ డయాక్సైడ్, మీథేన్, నైట్రస్ ఆక్సైడ్, నీటి ఆవిరి మరియు సింథటిక్ ఫ్లోరినేటెడ్ వాయువులను గ్రీన్‌హౌస్ వాయువులు అంటారు, ఈ వాయువులు సౌర వికిరణాన్ని ట్రాప్ చేసి భూమిని వేడి చేస్తాయి. భారతదేశం 1990 మరియు 2000 మధ్యకాలంలో 384,000 హెక్టార్ల అడవులను కోల్పోయింది. 2010లో, భారతదేశం 31.3 %వీష్టు% సహజ అడవులను కలిగి ఉంది, దాని భూభాగంలో 11% పైగా విస్తరించి ఉంది. 2022లో, ఇది 117 ఖా సహజ అడవులను కోల్పోయింది, ఇది %జూ%2 మరియు గ్లోబల్ వార్మింగ్ పెరుగుదలకు దారితీసింది. వేసవి ఆరోగ్యాన్ని ఎలా ప్రభావితం చేస్తుంది: వేసవిలో సురక్షితంగా మరియు ఆరోగ్యంగా ఎలా ఉండాలి! హీట్ స్ట్రోక్... హీట్ స్ట్రోక్ అనేది కోర్ బాడీ టెంపరేచర్ 40.5ళీ కంటే ఎక్కువగా ఉండడం హీట్ స్ట్రోక్‌ను ఎలా గుర్తించాలి మరియు లక్షణాలు ఏమిటి? విపరీతమైన అలసట, తల నొప్పి, వాంతులు, దాహం పెరగడం, పొత్తికడుపు నొప్పి, కొన్నిసార్లు వృద్ధులు కోమాలోకి జారడం, వేగంగా గుండె కొట్టుకోవడం, ఊపిరి ఆడకపోవడం, స్కిన్ బర్న్ అండ్ స్కిన్ డ్యామేజ్ సన్‌స్క్రీన్ గ్లాసెస్ ఉపయోగించండి మరియు గొడుగు ఉపయోగించండి. అవసరమైతే తప్ప ఉదయం 11 నుండి సాయంత్రం 4 గంటల మధ్య బయటకు వెళ్లడం మానుకోండి ఫుడ్ పాయిజన్ ఫుడ్ పాయిజనింగ్ అనేది ఒక సాధారణ వేసవి ఆరోగ్య ప్రమాదం,వెచ్చని వాతావరణంలో బ్యాక్టీరియా వేగంగా పెరుగుతుంది. మరుసటి రోజు వండిన అన్నం తినకుండా ఉండండి,జంక్ మరియు అపరిశుభ్రమైన ఆహారాన్ని తినడం మానుకోండి, తినడానికి ముందు పండ్లు మరియు కూరగాయలను చాలాసార్లు కడగాలి. మీకు కిడ్నీ గుండె లేదా కాలేయ సమస్యలు ఉంటే తప్ప రోజుకు 3 లీటర్ల నీరు త్రాగాలి. పుచ్చకాయ, సీతాఫలం, నిమ్మరసం, పెరుగు, దోసకాయ, కొబ్బరి నీరు, తాజా కడిగిన కూరగాయలు, నూనె లేని ఆహారం తీసుకోవడం సురక్షితం. వేసవిలో అలెర్జీ వ్యాధులు కూడా ఎక్కువగా కనిపిస్తాయి. వేడి సంబంధిత సమస్యలకు అధిక రిస్క్ గ్రూప్ అయిన వారు? పిల్లలు, 60 ఏళ్లు పైబడిన వృద్ధులు, మధుమేహ వ్యాధిగ్రస్తులు, హృద్రోగులు, గర్భిణులు ,నిర్మాణ కార్మికులు, ట్రాఫిక్ పోలీసులు, బస్సు మరియు ఆటో డ్రైవర్లు వేడి సంబంధిత వ్యాధులకు గురయ్యే ప్రమాదం ఎక్కువగా ఉంది మరియు అదనపు జాగ్రత్తలు తీసుకోవాలి. తేలికపాటి బట్టలు ధరించండి మరియు నలుపు రంగును నివారించండి, ప్రత్యక్ష సూర్యకాంతిలో పని చేయకుండా ఉండండి, ఎక్కువ నీరు త్రాగండి మరియు తాజాగా వండిన ఆరోగ్యకరమైన ఆహారాన్ని తినండి. మన భవిష్యత్ తరాల కోసం చెట్లను నాటి మన ప్రియమైన భూమిని కాపాడుకుందాం.

## ఐద్వా ఆవిర్భావం మహిళా ఉద్యమాలకు స్ఫూర్తి : రాష్ట్ర సహాయ కార్యదర్శి కందికొండ గీత



**నాగర్‌కర్నూలు, మేజర్‌న్యూస్:** అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆవిర్భావం సందర్భంగా మంగళవారంనాగర్ కర్నూల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి కందికొండ గీత మాట్లాడుతూ మోటూరు ఉదయం గారి ఆధ్వర్యంలో ఆంధ్ర మహిళా సంఘం గా ఏర్పడి 1981 ఆంధ్ర మహాసభ ఏర్పాటు చేసుకుని దేశవ్యాప్తంగా ఒకటే పేరు ఉండాలని ఉద్దేశించి అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం గా ఏర్పడి మహిళలకు రక్షణగా మహిళా హక్కుల సాధనకై మహిళలపై జరుగుతున్న దాడులకు హింసకు హత్యలకు అత్యాచారాలకు వ్యతిరేకంగా పోరాడుతూ మహిళలకు రక్షణగా మేమున్నామంటూ ఐద్వా భరోసానిస్తున్నది ఇందుకు ఉదాహరణ బిల్కీస్ భాను కేసులో నిందితులకు ప్రధాని బెయిల్ ఇప్పించి సన్మానాలు చేసినా కూడా విడుదల చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మళ్లీ పిటిషన్ వేసి సుప్రీంకోర్టు కూడా ఆలోచించే విధంగా అయిద్వా ఆల్ ఇండియా నాయకురాలు సుభాషిని అలిగారు సుప్రీంకోర్టులో పిటిషన్ వేసి దోషులను జైలుకు పంపే వరకు పోరాడిన చరిత్ర 5వకు ఉన్నది అలాగే ఢిల్లీలో జరిగిన ఘటనపై అత్రాస్లో జరిగిన ఘటనపై కానీ ఇలా దేశ నలుమూలల ఎక్కడ మహిళలకు అన్యాయం జరిగిన ఐద్వా వారికి అండగా ఉంటుందని ఆమె అన్నారు. అలాగే రాష్ట్రంలో కానీ జిల్లాలో గాని మహిళలకు జరుగుతున్న అన్యాయాలని ఎదిరించి పోరాటంలో ముందుండి పరిష్కారం చేసేదానిలో ముందుంటామని అందులో భాగంగా మహిళల హక్కుల కోసం వారి సమస్యల పరిష్కారం కోసం వారికి ఎప్పటికప్పుడు స్ఫూర్తినిస్తూ వారిని పోరాటాల్లో నడిపించడం ఐక్య పోరాట దృక్పథమని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఈశ్వరమ్మ లింగమ్మ మంజుల తదితరులు పాల్గొన్నారు.

## వాల్మీకి మహర్షి విగ్రహాన్ని ప్రతిష్టించాలని ఎమ్మెల్యేకు వినతి



**వనపర్తి టౌన్, మేజర్ న్యూస్ :** వనపర్తి మున్సిపల్ కార్యాలయంలో వృధాగా పడి ఉన్న మహర్షి వాల్మీకి విగ్రహాన్ని వివేకానంద చౌరస్తాలో ఏర్పాటు చేయాలని కోరుతూ వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం శాసనసభ్యులు తూడి మేఘారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అందుకు సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం తానే దగ్గరుండి స్వయంగా వాల్మీకి మహర్షి విగ్రహాన్ని ప్రతిష్ట చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. వాల్మీకుల ఎస్టీ రిజర్వేషన్ ఉందో కాంగ్రెస్ పార్టీ ఎస్టీ రిజర్వేషన్ కు కట్టుబడి ఉందని అన్నారు. వాల్మీకి సంఘం నాయకులు మాట్లాడుతూ గతంలో వాల్మీకి మహర్షి విగ్రహాన్ని కేడిఆర్ నగర్ లోని ఏనుగులబొంద పార్కులో ఏర్పాటు చేసుకుంటే అప్పటి మంత్రి నిరంజన్ రెడ్డి అసహనం వ్యక్తం చేస్తూ పోలీస్ బలగంతో విగ్రహాన్ని తొలగించి మున్సిపాలిటీ కార్యాలయంలో పడేశారని, అహంకార పూరిత వ్యవహారాలకు పూనుకొని బీసీ సామాజిక వర్గాలను అణిచి వేయాలని కుట్ర కుతంత్రాలతో నియంతల వ్యవహరించిన నిరంజన్ రెడ్డికి వాల్మీకి విగ్రహం ఏర్పాటు చేయాలని ఎన్నోసార్లు వాల్మీకులు వినతి పత్రం అందించడం జరిగిందని, మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో వాల్మీకుల ఓట్ల కొరకు మళ్లీ మహర్షి విగ్రహం గుర్తుకొచ్చి వివేకానంద చౌరస్తాలో వాల్మీకి విగ్రహం అని వాల్మీకులను మోసం చేసేందుకు భూమి పూజ చేశారని, మాజీ మంత్రి బీసీల ఆగ్రహానికి గురై గుణపాఠం చెప్పడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా వాల్మీకి సంఘం సీనియర్ నాయకులు, కాంగ్రెస్ నాయకులు బోయ మురళి, వాల్మీకి సంఘం ఉమ్మడి పాలమూరు జిల్లా కన్వీనర్, కాంగ్రెస్ నాయకులు మండ్ల దేవన్న నాయుడు, వాల్మీకి సంఘం జిల్లా నాయకులు నల్లబోతుల రవి నాయుడు, వెంకటేష్ నాయుడు, ఎద్దుల రవి నాయుడు, వాల్మీకి సంఘం పట్టణ కార్యదర్శి మండ్ల రాఘవేంద్ర, సింగోటం నాయుడు, విష్ణు నాయుడు, గణేష్ , రవి, వాల్మీకి నాయకులు తదితరులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఎల్సీడిసి కార్యక్రమాన్ని పర్యవేక్షించిన జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి



**గద్వాల ప్రతినిధి, మేజర్ న్యూస్:** జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్కే. సిద్ధప్ప సుంకులమ్మ మెట్టు గద్వాల ప్రాంతంలో కుష్టు వ్యాధి గ్రస్తులు గుర్తింపు ఉద్యమం (ఎల్సీడిసి -2024) కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ నెల 11 నుండి 24 వరకు జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఆశా కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటి సర్వే ద్వారా అనుమానిత కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించి దగ్గర్లోని ప్రభుత్వాసుపత్రికి రెఫర్ చేస్తారని తెలిపారు. వైద్య సిబ్బంది ప్రతిరోజూ ఉదయం 6 గంటల నుంచి 9 గంటల మధ్య ఇంటింటి సర్వే ద్వారా ఈ కార్యక్రమము నిర్వహిస్తారని సూచించారు. ఈ సర్వేలో ఎవరికైనా స్పర్శ లేని ఎర్రని రాగి లేదా గోధుమ రంగు గల మచ్చలు కలిగి ఉండడము అదేవిధంగా కాళ్లు చేతులలో తిమ్మిర్లు రావడం ,చెమట రాకపోవడం వంటి లక్షణాలు ఉన్నట్లయితే వారిని దగ్గరలోని ప్రభుత్వాసుపత్రికి రెఫర్ చేస్తారన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్లు అనుమానిత కుష్టి వ్యాధిగ్రస్తులను పరీక్షించి ఒకవేళ కుష్టు వ్యాధి అని నిర్ధారణ అయితే వెంటనే ఉచితంగా కుష్టు వ్యాధి కి సంబంధించిన మందులు ఇచ్చి చికిత్సలు నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు రాజు, మల్లికార్జున, లక్ష్మీదేవి ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతు వేదికలో చోరీ





**అయిజ మేజర్‌న్యూస్:** మంగళవారం రోజు జోగులాంబ గద్వాల జిల్లా ఐజ పట్టణ పరిధిలోని ఉన్న రైతు వేదిక లో చోరీ జరిగింది వివరాల్లోకి వెళితే బుధవారం ఉదయం సమయంలోఅనగా యధావిధిగా రైతు వేదిక ఆఫీస్ తెరిచే సమయానికి స్థానిక అధికారులు అక్కడ కీ వెళ్లగా అక్కడ వెళ్లిన తర్వాత కార్యాలయం పరిశీలించగా అక్కడ దొంగతనం జరిగింది అని గుర్తించి వెంటనే సంబంధిత స్థానిక వ్యవసాయ అధికారి యస్. శంకర్ లాల్ మరియు వ్యవసాయ విస్తరణ అధికారి యం.యువ రాజ్ వెంటనే పోలీస్ స్టేషన్‌కీ వెళ్లి పిర్యాదు చేయడం జరిగింది. స్పందించిన పోలీస్ శాఖ వారు సంఘటన స్థలాన్ని పరిశీలించడం జరిగింది. ఇట్టి చోరీలో సుమారు 30000/- విలువ చేసే వీడియో కాన్ఫరెన్స్ సంబంధించి పరికరాలు దొంగిలించడం జరిగింది అని అధికారులు తెలిపారు. కాబట్టి చోరీ చేసిన దుండగులను వెంటనే పట్టుకొని కఠిన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు కోరడం జరిగింది.

## నేడు అయిజ పోలీస్ స్టేషన్‌కు జిల్లా ఎస్పీ రాక

**అయిజ మేజర్ న్యూస్ :** జోగులాంబ గద్వాల్ జిల్లా ఐజ పట్టణ పరిధిలో జిల్లా ఎస్పీ రితిరాజ్ ఐపీఎస్ వారు అయిజ పోలీస్ స్టేషన్లో సందర్శించనున్న సందర్భంగా ఎవరైనా ఎస్పి కి ఫిర్యాదు చేయదలచిన వారు ఉంటే తమ సమస్యలను తెలిపేందుకు జిల్లా కేంద్రానికి రాలేని వారు ఫిర్యాదులు పరిష్కారం కాలేదని భావించిన వారు ఇతర బాధితులు ఎవరైనా ఉంటే నేడు ఐజ పోలీస్ స్టేషన్లో నేరుగా తమ సంప్రదించవచ్చని జిల్లా ఎస్పీ రితిరాజ్ ఐపీఎస్ ఐజ మండల ప్రజలకు తెలియజేశారు. ఫిర్యాదు దారులకు మరింత చేరువగా ఉండాలని ఉద్దేశంతో నేడు అయిజ పోలీస్ స్టేషన్ ను సందర్శించనున్న సందర్భంగా అక్కడి ప్రజలకు తమను కలిసేందుకు అందుబాటులో ఉంటానని ఎవరైనా తమ సమస్యలను తెలిపేందుకు జిల్లా కేంద్రాలకు రాలేని వారు మరియు తమ ఫిర్యాదులు పరిష్కారం కాలేదని భావించిన వారు ఇతర బాధితులు ఎవరైనా నేరుగా తమను కలుసుకొని వారి సమస్యలు తెలియజేయవచ్చు అని ఎస్పీ తెలిపారు.

## మేడికొండ రోడ్డులో అదుపుతప్పి బోల్తా పడ్డ కారు



**అయిజ మేజర్ న్యూస్:** మండలం పరిధిలో ఉన్న మేడికొండ రోడ్డుపై రోడ్డు అధ్వాన పరిస్థితుల కారణంగా ఒక దారుణం తర్వాత మరొక దారుణం జరుగుతూ ఉంది. బుధవారం రోజు ఐజ నుండి మేడికొండ వైపు వెళుతున్న కారు, రోడ్డులో ఏర్పడ్డ గుంతల కారణంగా అదుపుతప్పి బోల్తా పడ్డది. అదృష్టవత్తు కారులో డ్రైవర్ ఒక్కరే ఉండడంతో స్వల్ప గాయాలతో ప్రమాదం నుంచి బయటపడ్డాడు. అటుగా వెళుతున్న రైతులు కారులో నుంచి డ్రైవర్ ను బయటకు లాగి కాపాడారు. ఇలాంటి ఘటనలు చూసిన అధికారులు రోడ్డుకు మరమ్మతులు కాకుండా పూర్తిగా రోడ్డు వేసి ఇలాంటి ఘటనలు జరక్కుండా చూడాలని అన్నారు.

## పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు ప్రధాన కాలువలో అనుమానాస్పద స్థితిలో మహిళా మృతి



**రేవల్లి మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని శానాయిపల్లి గ్రామానికి చెందిన ఓ మహిళ మృతదేహం అనుమానాస్పద స్థితిలో లభ్యం అయిన ఘటన సోమవారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికుల సమాచార ప్రకారం మండల పరిధిలోని శానాయిపల్లి గ్రామానికి చెందిన సాతర్ల లక్ష్మమ్మ (50) నాగర్ కర్నూలు జిల్లా పరిధిలోని గుడిపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో వివాహం చేయడం జరిగింది. కొన్ని కారణాలవల్ల భర్త, భార్య లు విడిపోయారు. ఆ తర్వాత సొంత గ్రామమైన శానాయిపల్లి లో తన తల్లి గారి ఇంట్లో తన మేన అల్లుడు దగ్గర గ్రామంలోనే ఉంటూ జీవనం సాగిస్తుంది.ఆదివారం సాయంత్రం ఇంటి నుండి వెళ్లిందని,చీకటి పడిన ఇంటికి రాలేదని కుటుంబ సభ్యులు చెప్పారు.కాగా సోమవారం ఉదయం కొత్త బండరాయిపాకుల స్మశాన వాటిక నుంచి రేవల్లికి వెళ్లే దారిలో ఉన్న పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు ప్రధాన కాలువలో టన్నెల్ వద్ద ఉన్న బ్రిడ్జి కింద కాలువలో అనుమానస్పంద గా లక్ష్మమ్మ మృతి చెందిన విషయం తెలవడంతో అక్కడికి వెళ్ళి ,టన్నెల్ ,బ్రిడ్జి నిర్మాణం పనులు జరుగు తున్న స్థలంలో మృతదేహం లభ్యం కావడంతో కుటుంబ సభ్యులు ఆందోళన దిగారు.ఈ విషయ మై స్థానిక ఎస్సై తిరుపతి రెడ్డి సంప్రదించగా కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేశామని,దీనిపై సమగ్ర దర్యాప్తు చేస్తామని, మృతదేహాన్ని మాత్రం పోస్ట్ మార్డం కోసం వనపర్తి జిల్లా ఆసుపత్రి కి తరలించి నట్టు తెలిపారు.అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.

## మహిళాభివృద్దే - దేశ ప్రగతికి తొలిమెట్టు

### - మహిళా సాధికారత విభాగం కన్వీనర్ ఎన్.సుభాషిణి - బిఆర్ఆర్ కళాశాలలో వన్ డే వర్క్ షాప్



**జడ్చర్ల మేజర్‌న్యూస్:** మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడమే దేశ ప్రగతికి తొలిమెట్టని మహిళా సాధికారత విభాగం కన్వీనర్ ఎన్.సుభాషిణి అన్నారు. డాక్టర్ బి.ఆర్.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జడ్చర్లలోని మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో పలు అంశాలపై మంగళవారం ఒకరోజు వర్క్ షాప్ నిర్వహించారు. సభాధ్యక్షులు కళాశాల వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాసులు అధ్యక్షోపన్యాసంలో మహిళలు అన్ని రంగాలలో ముందంజలో ఉన్నారని, కళాశాల విద్యార్థులు బాగా చదివి ఉన్నతంగా స్థిరపడాలని పిలుపునిచ్చారు. మహిళా సాధికారత విభాగం కన్వీనర్ ఎన్.సుభాషిణి మాట్లాడుతూ మహిళ ఒక సమిష్టి శక్తిగా ఎదగాలని అవరోధాలను అవకాశాలుగా మలుచుకునే శక్తి మహిళలకు మెండు అని తెలిపారు. నెలసరి సమస్యలు -నివారణోపాయాలు, సమతులాహారం అనే అంశం పై సుశ్రుత హాస్పిటల్ ఎం.డి. ప్రముఖ గైనకాలాజిస్ట్ డా.ప్రతిభ మాట్లాడుతూ విద్యార్థులకు పీపీటీ ద్వారా చక్కని అవగాహన కల్పించారు. సర్వికల్ క్యాన్సర్, బ్రెస్ట్ కాన్సర్ వంటి పలు స్త్రీల సమస్యలకు నివారణోపాయాలు సూచించారు. మహిళా సాధికారతలో సామాజిక సేవా సంస్థల పాత్ర అనే అంశంపై పాలమూరు విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ కో- ఆర్డినేటర్ డాక్టర్ ప్రవీణ మాట్లాడుతూ ఎన్ ఎస్ ఎస్ వంటి సంస్థల ద్వారా విద్యార్థులలో సమన్వయ శక్తి పెరుగుతుందన్నారు. మహిళా వ్యవస్థాపకులు- సవాళ్లు అనే అంశంపై లక్కీ బ్యూటీ కేర్ వ్యవస్థాపకురాలు ఎన్. యశస్విని, శ్రీ సాయి బోటిక్ వ్యవస్థాపకురాలు శ్రీదేవి తమ జీవితానుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. అడ్డంకులు అనేకం వస్తాయని సవాళ్లను స్వీకరించే లక్షణం పెంపొందించుకోవాలన్నారు. ఆవేదనలు ఆక్రోశాలకు చోటు లేదు, విజయమే మాట్లాడుతుందన్నారు. కళాశాల విద్యార్థులు మగువా మగువా అనే పాటపై చేసిన నృత్య ప్రదర్శన ఆహుతులను అలరించింది. మహిళలపై పెట్టుబడి అవసరమని ఈ వర్క్ షాప్ తీర్మానించింది. ఈ కార్యక్రమంలో డా. ప్రతిభ, మహిళా సాధికారత విభాగ సభ్యులు నీరజ, మంజుల, సుభాషిణి, మంజుల, రమాదేవి, లత, రజిని, అనిత, భార్గవి లత, శ్రావణి, మాధవి, మాధవి, సింధులు, జగన్, బాలరాజు, విట్టల్, మల్లికార్జున్, విద్యార్థులు పాల్గొన్నారు.

## బీసీలను విస్మరించిన పార్టీలకు బుద్ధి చెబుదాం - బిసి సేన రాష్ట్ర అధ్యక్షుడు బూరుగుపల్లి కృష్ణ యాదవ్



**జడ్చర్ల మేజర్ న్యూస్ :** బీసీలను విస్మరించిన పార్టీల అభ్యర్థులకు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ ప్రజా ప్రతినిధులెవ్వరూ ఓట్లు వేయొద్దని బిసిసేన రాష్ట్ర అధ్యక్షులు బూరుగుపల్లి కృష్ణ యాదవ్ పిలుపునిచ్చారు. జడ్చర్ల పట్టణంలోని బీసీసేన కార్యాలయంలో మంగళవారం బీసీసేన నాయకుల సమావేశం నిర్వహించారు. బిసి సేన రాష్ట్ర అధ్యక్షులు బూరుగుపల్లి కృష్ణ యాదవ్ మాట్లాడుతూ, ఎన్నికలకు ముందు బీసీల అభ్యున్నతికి పాటుపడతామని హామీ ఇచ్చిన విపక్ష పార్టీలు, పాలితులను పాలకులను చేయడమే మా ధ్యేయమని ప్రకటించిన రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా పార్లమెంటు, స్థానిక సంస్థల శాసనసమండలి ఉప ఎన్నికలలో, బీసీలను విస్మరించి ఒకే సామాజిక వర్గానికి సీట్లు కేటాయించడం సామాజిక స్ఫూర్తికి విరుద్ధమని మండి పడ్డారు. ఎంపీ, ఎమ్మెల్సీ సీట్ల కేటాయింపుల్లో అధికార..విపక్ష పార్టీలు బీసీలను విస్మరించడం దారుణమని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటు వేసే బిసి సామాజిక వర్గానికి చెందిన ప్రజా ప్రతినిధులు బీసీ వ్యతిరేక పార్టీల అభ్యర్థులకు ఓటు వేయకూడదని పిలుపునిచ్చారు. కళ్ళ ముందు జరుగుతున్న అన్యాయాన్ని ఆయా పార్టీల జెండాలు మోస్తు మోసపోతున్న బీసీ నాయకులు తిరగబడే రోజు దగ్గర్లోనే ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో బీసీసేన మండల ప్రధాన కార్యదర్శి గొడుగు నర్సిములు, జిల్లా నాయకులు కుర్వగడ్డ పల్లి గోపాల్, కట్ట మురళి, మండల కార్యదర్శి సురభి రఘు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గోపాల్, ముదునూర్ వెంకటేష్, జగదీశ్వరా చారీ, నర్సిములు, వెంకటేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మోసకారి జర్నలిస్టు సంఘాల నాయకుల మాటలు నమ్మి మరో సారి మోసపోకండి

### - వనపర్తి జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు అంబటి స్వామి



**వనపర్తి టౌన్, మేజర్ న్యూస్ :** మోసపూరిత మాటలు చెప్పి , ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఎర వేసి తోటి జర్నలిస్టులను మోసం చేసిన జర్నలిస్టు సంఘాల నాయకులను నమ్మి మరో సారి మోసపోవద్దని వనపర్తి జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు అంబటి స్వామి అన్నారు. మంగళవారం వనపర్తి పట్టణంలోని యాదవ సంఘం భవనంలో వనపర్తి జిల్లా ప్రెస్ క్లబ్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కొన్ని ఏళ్ళతర్వాత వనపర్తి జిల్లా ప్రెస్ క్లబ్ కమిటీ ఏర్పాటు కావడం సంతోషదాయకమన్నారు. ఇప్పటికైనా సోదర జర్నలిస్టులు అవకాశవాదా యూనియన్ నాయకుల మాటలు నమ్మవద్దని ఆయన కోరారు. ఒక ప్రణాళిక బద్దంగా జర్నలిస్టుల సమస్యలను కలసి కట్టుగా పరిష్కరించుకోవడం కోసం కలసి రావాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రెస్ క్లబ్ కమిటీ నాయకులు, వర్కింగ్ జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు. వనపర్తి ప్రెస్ క్లబ్ కమిటీ ఎన్నిక.. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా అంబటి స్వామి, ప్రధాన కార్యదర్శిగా పి పవన్ కుమార్, కోశాధికారిగా జి రామకృష్ణారెడ్డి, ఉపాధ్యక్షులుగా బి. రవి ప్రసాద్, రవి శంకర్ గౌడ్, సంతోష్ కుమార్ యాదవ్, కే హుస్సేన్, ఆంజనేయులు యాదవ్, కార్యదర్శులుగా కడమంచి శేఖర్, సాయిరాం, నాకొండ యాదవ్ , అశోక్ గౌడ్, సహాయకార్యదర్శులుగా ప్రవీణ్ కుమార్, ఎం ఏ.అలీమ్, కే గోపాల్, సలహాదారులుగా లింగన్ గౌడ్, దశరథం, పూరి సురేష్, భక్త రాజు, ప్రచార కార్యదర్శులుగా డి శ్రీనాథ్, ముంత రవి, గుజ్జుల స్వామి, కమిటీ సభ్యులుగా జి.రవి, నరసింహ రాజు, బాలరాజు, కృష్ణయ్య, లక్ష్మీనారాయణ, ఎండి ఖలీల్, వేణుగోపాల్, మనోహర్, జి.బిసన్న, సోషల్ మీడియా కన్వీనర్‌లుగా ఎం.అరుణ్ కుమార్, విష్ణు, టి.మహేష్‌లను ఎన్నుకున్నారు.

## సిపిఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చెయ్యాలి

### - తపస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజారెడ్డి, శేఖర్ ముదిరాజ్



**అచ్చంపేట అర్బన్ మేజర్ న్యూస్:** నిలిచిపోయిన ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియకు అడ్డుగా ఉన్న సమస్యలను పరిష్కరించుటకు ప్రభుత్వం చొరవచూపి సత్వరమే బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజారెడ్డి, శేఖర్ ముదిరాజ్ ప్రభుత్వాన్ని కోరారు. మాజీమంత్రి హరీష్ రావు ఉద్యోగ ఉపాధ్యాయలపై మాట్లాడిన అనుచిత వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మంగళవారం అచ్చంపేట పట్టణంలోని వనవాసి సేవా ప్రకల్ప ఆవాసంలో తపస్ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని రాజారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేశారు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకట్ రెడ్డి విచ్చేసి పలు విద్యారంగ సమస్యలపై మాట్లాడుతూ సిపిఎస్ ను రద్దుచేసి పాత పెన్షన్ ను అమలు చేయాలని, అన్ని పాఠశాలలలో మౌలిక వసతులు కల్పించాలని, పెండింగ్లో ఉన్న నాలుగు డిఏలను ప్రకటించి నూతన పిఆర్సిని అమలు చేయాలని, కస్తూర్బా విద్యాలయాలలో పనిచేసే ఉపాధ్యాయినిలకు కనీస వేతనాలు అందజేసి సకాలంలో జీతాలు చెల్లించాలని నూతన జాతీయ విద్యా విధానాన్ని అమలు చేయాలని, 317 జీవో బాధితులకు న్యాయం చేయాలని, పండిట్ పీయిటిల సమస్యలను పరిష్కరించాలని, 20 రోజులలో ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న కారణంగా పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు రాష్ట్ర నాయకులు శ్రీనివాసులు, పెంట్యా నాయక్, జిల్లా నాయకులు మురళీధర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి,అరవిందరావు.ప్రవీణ్ రెడ్డి, జగదీశ్వర్,రాజశేఖర్ రావు ,నర్సిరెడ్డి, రాంగోపాల్ గౌడ్.నాగేశ్వరరావు, రమేష్, రాము వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యువ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉపాధి సిబ్బంది బాధ్యతగా పనిచేయాలి లేకుంటే చర్యలు తప్పవు : జిల్లా పిడి డిఆర్డిడిఓ నరసింహులు

**దేవరకద్ర మేజర్ న్యూస్ :** ఉపాధి హామీ సిబ్బందులు ఉపాధి హామీ పథకం లో గ్రామాల లోని బాధ్యతగా పనిచేయాలని లేకుంటే వారిపై చర్యలు తప్పవని జిల్లా అధికారి డిఆర్ డి ఓ. నరసింహులు తెలిపారు. మండల కేంద్రంలోని మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించినటువంటి ఉపాధి హామీ పథకం 12వ విడుత సామాజిక తనిఖీ కార్యక్రమం లో భాగంగా. ముఖ్యఅతిథిగా జిల్లా అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా దేవరకద్ర మండలానికి సంబంధించి 33 గ్రామాలలో.పనిచేస్తున్నటువంటి ఉపాధి హామీ సిబ్బందులు తము చేసినటువంటి పనుల పైన అధికారులకు నివేదికలు ఇస్తూ తెలియజేశారు ద్రేవరకద్ర మండలం పెద్ద మండలం అని కూలీలు కూడా 75% పనులు చేస్తారని వారికి తప్పకుండా ప్రతిదినము హాజిర్ వేసి డబ్బులు ఇవ్వాలని. ఎవరు కూడా తప్పుడు. మాస్టర్లు వేయడం .సంతకాలు చేయడం పనులకు రాకుండా కూడా డబ్బులు ఇవ్వడం సరైనది కాదు అని.వరు తెలిపారు.. ఈ కార్యక్రమంలో. జిల్లా అడిషనల్ డి ఆర్ డి ఓ ముసాయిదా బేగం .ఏపిడి శ్రీపాద .ఏపిఎం మంజుల. ఎఫ్ఎమ్. హేమలత.ఎంపీడీవో శ్రీనివాసులు.ఎంపీవో శ్రీనివాసరావు. ఈ ఓపిఆర్డి ఇతర.అధికారులు.తదితరులు.పాల్గొన్నారు.

## అభిమానాన్ని చాటుకున్న చిత్రకారుడు



**నాగర్‌కర్నూల్ ఎడ్యుకేషన్ మేజర్‌న్యూస్:** నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచకుల్లా రాజేష్ రెడ్డి చిత్రాన్ని తన స్వహస్తంతో గీసి తన అభిమానాన్ని చాటుకున్న చిత్రకారుడు భాస్కర్ హౌడేకర్ నాగర్ కర్నూల్ పట్టణానికి చెందిన భాస్కర్ హౌడేకర్ తన చిన్నతనం నుండే తనకు చిత్రలేఖనం అంటే చాలా మక్కువ దాంతో తను చిత్రలేఖనమే వృత్తిగా ఎంచుకొని అందు లోనే ప్రభుత్వ ఉద్యోగాన్ని కూడా సంపాదించు కున్నారు. చిత్రలేఖనంలో ఆయన దేశ నాయకులు మరియు రాజకీయ నాయకుల యొక్క చిత్రాలను గీసి ఎన్నో బహుమతులను అందుకున్నారు. ప్రస్తుతం హైదరాబాదులోని గోల్కొండ ప్రభుత్వ పాఠశాలలో ఆర్ట్ టీచర్ గా పని చేస్తున్నారు. నాగర్కర్నూల్ ప్రస్తుత ఎమ్మెల్యే డాక్టర్ కూచూకుళ్ళ రాజేష్ రెడ్డి చిత్రపటాన్ని గీసి అభిమానాన్ని చాటుకున్నారు. ఆ చిత్రపటాన్ని హైదరాబాదులోని ఎమ్మెల్యే నివాసంలో డాక్టర్ రాజేష్ రెడ్డికి అందించడం జరిగింది. ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి భాస్కర్ హెడేకర్ను అభినందించారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచిత ప్లేట్ల పంపిణీ




**కల్వకుర్తి మేజర్ న్యూస్:** మండల పరిధిలోని పంజుగుల గ్రామ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు మంగళవారం తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ శ్రీ గోలి శ్రీనివాస్ రెడ్డి కుమార్తె గోలి సాత్విక జన్మదిన సందర్భంగా గోలి శ్రీనివాస్ రెడ్డి సహకారంతో లయన్స్ క్లబ్ ఆఫ్ కల్వకుర్తి ద్వారా 130 మంది విద్యార్థులకు ప్లేట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షులు కల్మిచర్ల రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వ బడుల బలోపేతానికి లయన్స్ క్లబ్ ఆఫ్ కల్వకుర్తి ఎంతగానో కృషి చేస్తుందన్నారు, ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పుస్తకాలను,ఆట వస్తువులను స్పోర్ట్స్ దుస్తులతో పాటుగా అనేక సాంస్కృతిక, సాంకేతికత పోటీలను నిర్వహించి బహుమతులను క్లబ్ ద్వారా అందిస్తున్నట్లు తెలిపారు, ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కల్వకుర్తి అధ్యక్షుడు కల్మిచర్ల రమేష్, క్లబ్ ప్రధాన కార్యదర్శి చిగుర్లపల్లి శ్రీధర్, మెంబర్షిప్ కమిటీ అధ్యక్షుడు కిషన్ కుమార్, క్లబ్ ఆఫ్ కల్వకుర్తి సభ్యుడు దారమోని గణేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎల్లయ్య గౌడ్ ,ఉపాధ్యాయులు ఉమాదేవి, తిరుపతమ్మ కృష్ణయ్య పాండయ్య, పుష్పలత, భాగ్యమ్మ, గ్రామ కార్యదర్శి కృష్ణ, పాలేపు రాజేష్ తదితరులు ఉన్నారు.

## డిగ్రీ కళాశాలలో విస్తృతోపన్యాసం



**గద్వాల ప్రతినిధి, మేజర్ న్యూస్:** స్థానిక మహారాణి ఆదిలక్ష్మి దేవమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాల గద్వాల నందు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. షేక్ కలందర్ బాషా అధ్యక్షతన, పొలిటికల్ సైన్స్ 2 పార్ట్ మెంట్ వారి ఆధ్వర్యములో చేంజెస్ ఇన్ పోలిటికల్ సైన్స్ ఆపర్చునిటాస్ ఫర్ సస్టైనబుల్ లైఫ్ ఏ వే ఫార్వర్డ్ అనే అంశంపై ఎక్స్టెన్షన్ లెక్చర్ (విస్తృతోపన్యాసం) నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్గా పాలమూరు యూనివర్సిటీ మహబుబనగర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్న పొలిటికల్ సైన్స్ డిపార్ట్మెంట్ విభాగ అధిపతి డాక్టర్ కుమారస్వామి పై అంశంపై సుదీర్ఘంగా ప్రసంసించి రాజనీతి శాస్త్ర ప్రాధాన్యతను, వివరిస్తూ, రాజనీతిశాస్త్ర అధ్యాయనం చేయడం వల్ల రాజ్యం, రాజ్యాంగం గూర్చి, ప్రభుత్వం పై అవగాహన ఏర్పడుతుందన్నారు. దేశ నాయకత్వాన్ని ఎన్నుకోవడానికి సరైన రాజకీయ చైతన్యం ఏర్పడుతుందని ప్రభుత్వం నిర్వహించే అన్ని ఉద్యోగాలలో రాజనీతి శాస్త్రంపై ప్రశ్నలు అడగడం జరుగుతుందన్నారు. ఆగ్రామస్థాయి నుండి అత్యున్నత రాష్ట్రపతి పదవి వరకు ఎన్నికలు ఏవిధంగా నిర్వహిస్తారో స్థూలంగా విద్యార్థులకు వివరించారు. అలాగే కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రాజనీతి శాస్త్రాన్ని అధ్యాయనం చేయడం వల్ల అనేక ప్రభుత్వ ఉద్యోగాలు సాధించవచ్చని, ప్రభుత్వ పరిపాలన విధానాన్ని తెలుసుకోవచ్చన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి కళాశాల వైస్ ప్రిన్సిపాల్, పొలిటికల్ సైన్సు విభాగ అధిపతి డాక్టర్. డి. శ్రీపతినాయుడు, డా పి. లావీన మంజులత, సీనీయర అధ్యాపకులు కృష్ణమూర్తి, పొలిటకల్ సైన్స్ అధ్యాపకులు శ్రీనివాస్, నరేష్ బాబు, విజయలక్ష్మి, రానాలు పాల్గున్నారు.

## గాలికుంటు టీకాల పంపిణీ

**వడ్డేపల్లి మేజర్ న్యూస్:** ఏ మండల పరిధిలోని జక్కిరెడ్డిపల్లి గ్రామంలో 17 మంది రైతులకు చెందిన 162 పశువులకు టీకాలు వేయడం జరిగింది .ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారి పుష్పలత మాట్లాడుతూ పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించుకుంటే మేలు అని ఆమె అన్నారు వరప్రసాద్, లతీఫ్, రవికిరణ్, గోపాలమిత్ర, లక్ష్మన్న పాల్గొన్నారు.

## ఘనంగా రేణుకామాత బోనాలు ఉత్సవం



**మక్తల్, మేజర్ న్యూస్ :** మఖ్తల్ మండల పరిధిలోని వల్లభాపుర దత్తపీఠంలో మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. చివరి రోజు మంగళవారం రేణుకా మాతకు బోనాలు సమర్పించారు. ఎంపీపీ వనజాదత్తు, స్థానిక మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, బోనాలు సమర్పించారు. దీంతో దత్తపీఠంలో మహాశివరాత్రి ఉత్సవాలు ముగిశాయని విఠలానంద సరస్వతీ మహరాజ్, మాతా నిరంజన స్వామి, కమిటీ సభ్యులు దత్తు, చిట్యాల లక్ష్మణ్, చక్రధర్, ముస్లాయిపల్లి లక్ష్మణ్ గౌడ్, పూజారి రఘు తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాదు బయలుదేరిన బిజెపి నాయకులు



**కోయిలకొండ మేజర్ న్యూస్:** హైదరాబాదులో నిర్వహించే ఇంపీరియల్ గార్డెన్లో సోషల్ మీడియా వారియర్స్ తో కేంద్రమంత్రి అమీత్ షా దిశ నిర్దేశం సమావేశానికి మంగళవారం మండల బిజెపి నాయకులు తరలి వెళ్లారు. తెలంగాణలో ఎక్కువగా బిజెపి పార్టీకి ఎంపీ సీట్లు వస్తాయని తెలియజేశారు. అదేవిధంగా కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ప్రజలు ఆకర్షితులై బీజేపీ ఎంపీ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించుకోవడానికి సిద్ధంగా ఉన్నారని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో నారాయణపేట బిజెపి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు, బిజెపి మండల అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, బిజెపి నాయకులు చెన్నారెడ్డి, వెంకట్రాం రెడ్డి, రాములు గౌడ్ ,శ్రీనివాసులు, గోవర్ధన్, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులే ఉపాధ్యాయులు అయిన వేళ



**దేవరకద్ర ( కౌకుంట్ల )మేజర్ న్యూస్:** దేవరకద్ర మండలంలోని గోపన్ పల్లి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి, తోటి వారికి పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా కలెక్టర్గా షాయినాజ్ బేగం, డీఈవోగా సందీప్, హెచ్ఎంగా చైత్ర, వారితోపాటు 30మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ హక్ మరియు ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## అమిత్ షా సభకు తరలి వెళ్లిన మండల బిజెపి శ్రేణులు



**వంగూరు మేజర్ న్యూస్.** హైదరాబాదులోని ఎల్బీ స్టేడియం లో మంగళవారం నిర్వహించే విజయ సంకల్ప సమ్మేళన సభకు కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా ముఖ్యఅతిథిగా విచ్చేస్తున్న సందర్భంగా బిజెపి నాయకులతోపాటు వివిధ మోర్చాల అధ్యక్షులు బూతు స్థాయి అధ్యక్షులు శక్తి కేంద్రాల ఇన్చార్జీలు హైదరాబాద్ కు ప్రత్యేక బస్సులో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయనున్నట్లు తెలిపారు. ప్రధానిగా నరేంద్ర మోడీ హ్యాట్రిక్ సాధిస్తారని ధీమాను వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో మండల బిజెపి పార్టీ అధ్యక్షులు ఖానాపురం భాస్కర్ కార్యదర్శిలు జగన్మోహన్ రెడ్డి సైదులు నవీన్ రెడ్డి పాల్గొన్నారు.

## అనన్యశ్రీ ని అభినందించిన పియువిసి

**మహబూబ్ నగర్ పియు మేజర్ న్యూస్ :** ఎంజి యూనివర్సిటీ కొట్టాయం కేరళకు ప్రాతినిధ్యం వహించిన మక్తల్‌కు చెందిన వాలీబాల్ క్రీడాకారిణి పి. అనన్యశ్రీ పాలమూరు విశ్వవిద్యాలయాన్ని సందర్శించి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎల్బీ లక్ష్మీకాంత్ రాథోడ్ ను మంగళవారం కలిశారు. అనన్య చైనాలోని చెంగ్డులో జరిగిన వరల్డ్ యూనివర్శిటీ గేమ్స్, గుహతి అస్సాంలో జరిగిన ఖేలో ఇండియా యూనివర్శిటీ గేమ్స్ (సిల్వర్ మెడల్), కిట్ యూనివర్సిటీ భువనేశ్వర్‌లో జరిగిన ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ గేమ్స్ (గోల్డ్ మెడల్)కు ప్రాతినిధ్యం వహించింది. ఇంచార్జి రిజిస్ట్రార్ డా మధుసూదన్ రెడ్డి ఆమె తల్లిదండ్రులు వరలక్ష్మి –ఆనంద్ లు పాల్గొన్నారు.

## జిల్లా కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా ఏర్పుల నాగరాజు నియామకం



**పాలమూరు మేజర్‌న్యూస్:** జిల్లా కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గా మహబూబ్నగర్ పట్టణానికి చెందిన ఏర్పుల నాగరాజు నియమితులయ్యారు. ఈ మేరకు టిపిసిసి సోషల్ మీడియా కోఆర్డినేటర్ నవీన్ పిట్టం మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. నాగరాజు గత కొన్నేళ్ల నుంచి కాంగ్రెస్' పార్టీలో చురుగ్గా పనిచేస్తున్నారు. పట్టణ కాంగ్రెస్ ఎస్సీ సెల్ విభాగం అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. జిల్లా కాంగ్రెస్ సోషల్ మీడియా కోకన్వీనర్ గా ఉన్న నాగారాజు కోఆర్డినేటర్ గా నియమితులయ్యారు. నాగరాజు మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ పదవి అప్పగించిన టీపీసీసీ సోషల్ మీడియా చైర్మన్ మన్నె సతీష్, కోఆర్డినేటర్ నవీన్ పిట్టంతోపాటు డీసీసీ అధ్యక్షులు, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, అనిరుధ్ రెడ్డితోపాటు రాష్ట్ర, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అమలుచేస్తున్న 'సంక్షేమ పథకాలను సోషల్ మీడియా ద్వారా ప్రజల వద్దకు చేరువేస్తామని అన్నారు. జిల్లాలో కాంగ్రెస్ సోషల్ మీడియా విభాగాన్ని మరింత బలోపేతం చేస్తానని తెలిపారు.

## పేదల సొంతింటి కల నెరవేరబోతుంది : యువజన నాయకులు హరిందర్ రావు



**గండీడ్ మేజర్ న్యూస్:** ఇల్లు లేని నిరుపేదల సొంతింటి కల నెరవేరబోతుంది అని వికారాబాద్ జిల్లా యువజన కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి హరిందర్ రావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాసనసభ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారెంటీలు సిలిండర్ 500 రూపాయలకు,200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు, ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణం,ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు కట్టించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈనెల 11న భద్రాచలంలో నిర్వహించిన సభలో ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రారంభించి ఇల్లు లేని నిరుపేదల కల సాకారం అయ్యే విధంగా దళిత,గిరిజన,బడుగు బలహీన,మైనార్టీ వర్గాల ఆత్మగౌరవం కోసం సొంత ఇల్లు ఉండాలని ఆలోచించి ఇందిరమ్మ ఇండ్ల పథకానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు.శాసనసభ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి కృషి చేసిన ప్రతి కార్యకర్త రానున్న పార్లమెంట్ ఎన్నికలలో రెట్టింపు ఉత్సాహంతో పనిచేసి కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థులను గెలిపించేందుకు కృషి చేయాలని అన్నారు.

## నారాయణపేట జిల్లా మత్స్య సహకార సొసైటీ వైస్ ప్రెసిడెంట్ గా నీరటి నరసింహనాయుడు ముదిరాజ్



**ధన్వాడ మేజర్ న్యూస్ :** నారాయణపేట జిల్లా మత్స్య సహకార సొసైటీ ఎన్నికలలో 9 తారీఖున గెలుపొందిన 11 మంది డైరెక్టర్లకు నియామక పత్రాలు ఇచ్చి జిల్లా ప్రెసిడెంట్ కాంతుకుమార్ ముదిరాజ్, వైస్ ప్రెసిడెంట్ నర్సింహ నాయుడు ముదిరాజ్ లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది, ఈ కార్యక్రమంలో మాజీ ప్రెసిడెంట్ కోళ్ల వెంకటేష్ ముదిరాజ్ ఎన్నికల అధికారి మరియు ఏడి రాణా ప్రతాప్ గార్లు. అంజయ్య చారి, ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షులు సరాఫ నాగరాజు ముదిరాజ్ , దామరగిద్ద ఈదప్ప ముదిరాజ్ మరికల్ నారాయణ ముదిరాజ్, యమునోనిపల్లి గౌని శ్రీనివాస్ ముదిరాజ్,మాగనూర్ కృష్ణయ్య ముదిరాజ్ గడ్డం నరేష ముదిరాజ్ ఫిషరీస్ సంగం పెద్దలు పాల్గొనడం జరిగింది.

## బూతు లెవెల్ ఏజెంట్ లకు ఓటింగ్ పై అవగాహన కార్యక్రమం



**నవాబ్ పేట మేజర్‌న్యూస్:** నవాబ్ పేట్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నీరటి రామచంద్రయ్య ఆధ్వర్యంలో మండల కేంద్రములోని స్టార్ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన బూతు లెవెల్ ఏజెంట్ లకు ఓటర్ లిస్ట్ పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా రుకువర్ధన్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి పాల్గొని బూతు లెవెల్ ఏజెంట్ లకు నాయకులకు ట్రైనింగ్ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో నవాబ్ పేట మండలం కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోండి

**గద్వాల ప్రతినిధి, మేజర్ న్యూస్:** హైదరాబాద్ స్కూల్ ఆఫ్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ ట్రైనింగ్ ఇన్ స్టిట్యూట్ ద్వారా హైదరాబాద్ లో బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ లో రెండు నెలల నాన్ రెసిడెన్షియల్ ఫ్రీ ట్రైనింగ్ ఇవ్వనున్నట్లు జిల్లా బి. సి అభివృద్ధి అధికారిణి బి. సరోజ ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ ట్రైనింగ్ ప్రోగ్రాం పూర్తయిన తర్వాత ప్రైవేట్ బ్యాంకుల్లో ప్లేస్ మెంట్ ఉంటుందన్నారు. గ్రాడ్యుయేట్, 26 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న అభ్యర్థులు ఈ నెల 15 నుండి 25 వ తేదీ వరకు ఆన్ లైన్ లో రిజిస్ట్రేషన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని, పై శిక్షణ కార్యక్రమానికి బీసీ అభ్యర్థులు అర్హులన్నారు. ఆన్ లైన్ స్క్రీనింగ్ టెస్ట్ ను ఈ నెల 31న ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో నిర్వహిస్తారన్నారు. అర్హులైన అభ్యర్థులు టీఎస్బిసి స్టడీ సర్కిల్ వెబ్సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థి తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.5 లక్షల లోపు ఉండాన్నారు. ఆన్ లైన్ స్క్రీనింగ్ టెస్ట్ లో వచ్చిన మార్కుల ఆధారంగా 30 మంది అభ్యర్థులను ఎంపిక చేసి వారికి ఉచిత శిక్షణ ఇవ్వబడుతుందని, మరిన్ని వివరాలకు 08546- 293022, 9908560268 లేదా బి. సి స్టడీ సర్కిల్ ఆఫీస్, టి.టి.యన్ బిల్డింగ్ (పాత యల్. ఐ. సి ఆఫీసు) మొదటి రైల్వే గేట్ దగ్గర, గద్వాల టౌన్, జోగులాంబ గద్వాల జిల్లా నందు ఆఫీసు వేళలలో సంప్రదించగలరు అని తెలిపారు.

## గుర్తింపు లేని వాహనాలకు వేలం

**వనపర్తి క్రైమ్, మేజర్ న్యూస్ :** జిల్లా పోలీసు శాఖ తనిఖీలలో పట్టుబడ్డ , దొరికిన వాహనాలను ఎవరు తీసుకొనిపోనందున వాటిని బహిరంగ వేలం వేయడం జరుగుతుందని జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు రక్షిత కె.మూర్తి తెలిపారు. ఇప్పటి వరకు పోలీసు ఆధీనములో 78 వాహనాలు ఉన్నట్లు ఆమె తెలిపారు. ఈ వాహనాలకు సంబంధించిన వివరాలను ఫేస్ బుక్, ట్విట్టర్, ఇతర సామాజిక మాద్యమాలలో ఉంచినట్లు ఎస్పీ తెలిపారు. ఇందులో 02-నాలుగు చక్రాల వాహనాలు, 03-మూడు చక్రాల వాహనాలు, 73- ద్విచక్ర వాహనాలు ఉన్నట్లు ఆమె వివరించారు. వీటిని ఏఆర్ హెడ్ క్వార్టర్స్ నాగవరం వనపర్తి లో ఉంచినట్లు ఆమె తెలిపారు. ఈ వాహనాలకు సంబంధించిన రిజిస్ట్రేసన్ నెంబర్, ఇంజన్ నెంబర్, చాసిస్ నెంబర్ ఆధారంగా గుర్తించి బాధితులకు అప్పగించడం జరుగుతుందన్నారు. వాహనం యొక్క ఆర్ సి సర్టిఫికెట్లు తీసుకొని జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో నోడల్ ఆఫీసర్ శ్రీనివాస్ కుమార్, %జవశ్రీశ్రీ% 8712670604 సంప్రదించాలని ఆమె తెలిపారు. ఈ వాహనాలను ఎవరు స్వీకరించని పక్షంలో వాటికి ప్రచురణ జరిగిన (07) వ రోజు నుండి తేదీ 20-03-2024 న చట్టప్రకారం బహిరంగ వేలం వేయడం జరుగుతందన్నారు.

## ప్రతి హెచ్డబ్ల్యూసిలో ఎన్సిడి బీపీ షుగర్ ఫాలోఅప్‌లను నిర్వహించాలి

### - స్టేట్ సివిహెచ్ఓ డాక్టర్ అబ్దుల్ వాసే



**గద్వాల ప్రతినిధి, మేజర్ న్యూస్:** జోగులాంబ గద్వాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శశికళ ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం 10 గంటలకు పాత డిఎంహెచ్ఓ ఆఫీస్ లో ఎన్సీడీ ఫాలో అప్, స్క్రీనింగ్లో స్టేట్ ఆఫీసర్ సివిహెచ్ఓ డాక్టర్ అబ్దుల్ వాసే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్సిడి స్క్రీనింగ్ జరిగేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పర్సంటేజీలు చూసుకొని స్క్రీనింగ్ చేయాలని ప్రతి ఒక్కరికి గవర్నమెంట్ లో వాడే వారందరికీ స్క్రీనింగ్ క్యాంపులు ఏర్పాటు చేసుకొని మందులను పంపిణీ చేయాలని ఆన్లైన్ లో ఎంట్రీ చేయాలని తెలిపారు. జిల్లాలో, వివిధ మండలాలలో స్క్రీనింగ్ చాలా తక్కువ ఉన్నదని ఏఎన్ఎం లను, ఎంఎల్ హెచ్పి ఇబ్బందిని మందలించారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ సిద్ధప్ప, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జి రాజు, జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్స్ శ్యాంసుందర్, మాక్సుద్, ఎస్టిఎస్ రమేష్, వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఉన్న బిఏఎంఎస్, ఆయుష్ డాక్టర్లు, స్టాఫ్ పాల్గొన్నారు.

## ఓటర్ చైతన్యం పై ఈ నెల 15న పాఠశాలల్లో మనవహారం నిర్వహించాలి - డీఈఓ గోవిందరాజులు

**నాగర్కర్నూల్ ఎడ్యుకేషన్ మేజర్ న్యూస్ :** ఓటర్లలో చైతన్యం నింపి స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ పి ఉదయ్ కుమార్ ఆదేశాల మేరకు జిల్లాలో స్వీప్ కార్యక్రమాలలో భాగంగా రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు శాతాన్ని పెంచడం కొరకు విద్యార్థుల్లో అవగాహన కల్పించి వారి తల్లిదండ్రులు ప్రతి ఒక్కరూ ఓటు వేసే విధంగా తెలియజేయడం కొరకు జిల్లాలోని అన్ని యాజమాన్య ఉన్నత పాఠశాలల్లో ఈనెల 15వ తేదీ శుక్రవారం రోజున ఉదయం 10 గంటలకు పాఠశాల ప్రాంగణంలోనే మానవహార కార్యక్రమాన్ని నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ గోవిందరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

# విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

### - గ్రామ పంచాయతీలను ఆకస్మిక తనిఖీ - గైర్హాజరైన పంచాయతీ కార్యదర్శిలపై క్రమశిక్షణా చర్యలు
### - జిల్లా పంచాయతీ అధికారి కృష్ణ






**లింగాల, మేజర్న్యూస్:** బాధ్యతలను విస్మరించి విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే గ్రామపంచాయతీ కార్యదర్శులపై శాఖ పరంగా చర్యలు తప్పవని జిల్లా పంచాయతీ అధికారి కృష్ణ హెచ్చరించారు. మంగళవారం మండల పరిధిలోని పద్మనపల్లి. చెన్నంపల్లి, శ్రీరంగ పూరం గ్రామపంచాయతీలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాలు మూసివేసి తాళం వేసి ఉండడాన్ని గుర్తించి అసహనంగా వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి గ్రామ కార్యదర్శులు అంకితభావం కృషి చేయాలని అన్నారు. ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామపంచాయతీ కార్యదర్శుల బాధ్యత మరింత పెరిగిందని గుర్తు చేశారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి శ్రద్ధ తీసుకోని, గ్రామాలలో మౌలిక సదుపాయాలను కల్పించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని అన్నారు. పారిశుధ్యం పట్ల తగు రీతిలో చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామ పంచాయితీ లలో అందుబాటులో లేని పంచాయతీ కార్యదర్శులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## పర్యావరణం పరిరక్షణ కోసం నూతన ఆవిష్కరణలు అవసరం - రాష్ట్ర పాజెక్ట్ అధికారి రాధిక



**మహబూబ్ నగర్ విద్యావిభాగం మేజర్ న్యూస్ :** ప్లాస్టిక్ వ్యర్థాలనుండి పర్యావరణాన్ని కాపాడేందు కోసం నూతన ఆవిష్కరణలు జరగాల్సిన అవసరం ఉందని ఎన్.జి.సి రాష్ట్ర ప్రాజెక్టు అధికారి రాధిక అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పిల్లలమర్రి సైన్స్ మ్యూజియంలో వేస్ట్ టూ వెల్త్ పేరిట ఏర్పాటు చేసిన ప్రదర్శనలో ప్రాజెక్ట్ అధికారి మాట్లాడారు. విద్యార్థులు ప్లాస్టిక్ వ్యర్థాలతో సృజనాత్మక వస్తువులను రూపొందించడం అభినందనీయమన్నారు. పర్యావరణాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యతగా భావించాలి. జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్ మాట్లాడుతూ, విద్యార్థులు ఆలోచనలకు పదునుపెట్టే విధంగా ఎన్.జి.సి కార్యక్రమాలను అమలు చేస్తోందని, వీటి ద్వారా అవగాహన పెంపొందించుకొని పర్యావరణాన్ని మనమందరం కలిసికట్టుగా కాపాడుకోవాలని అన్నారు. డీఎస్ఓ శ్రీనివాస్ మాట్లాడుతూ, జిల్లావ్యాప్తంగా నేషనల్ గ్రీన్ కాప్స్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ కోసం పెద్ద ఎత్తున కార్యక్రమాలు జరుగుతున్నాయని, విడివృతంగా విద్యార్థులలో పూర్తిస్థాయి అవగాహన ఏర్పడుతుందని అన్నారు. వచ్చే ఏడాది మరింత ప్రణాలిక బద్ధంగా కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సి ఎం ఓ బాలు యాదవ్, ఏ ఎం ఓ దుంకుడు శ్రీనివాస్, జిహెచ్ఎం వెంకట్ రాములు, న్యాయ నిర్ణీతలు తల్లోజు శ్రీనివాస్, దయాకర్ ,సమన్వయకర్త గుముడాల చక్రవర్తి గౌడ్ తదితరులు పాల్గొన్నారు. విజేతలు వీరే ప్లాస్టిక్ వ్యర్థాల వినియోగాన్ని తగ్గించేందుకు కోసం ఏర్పాటుచేసిన ప్రదర్శనలు జిల్లా వ్యాప్తంగా 59 పాఠశాలలు పాల్గొన్నాయి. మొదటి బహుమతి జెడ్ పి హెచ్ ఎస్ కోడుగల్, రెండవ బహుమతి జెడ్ పి హెచ్ ఎస్ అప్పంపల్లి, మరియు జెడ్ పి హెచ్ ఎస్ బోయిన్ పల్లి , తృతీయ బహుమతి మౌంట్ బేసిల్ హై స్కూలు,ప్రత్యేక ప్రోత్సాహక బహుమతులు జడ్.పి.హెచ్.ఎస్ భూత్పూర్, ఎదిర, ఆలూరు, కేజీబీవీ భూత్పూర్ పాఠశాలలు గెలుచుకున్నాయి.

# మున్సిపల్ కమిషనర్ పై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన కౌన్సిలర్స్

**కల్వకుర్తి మేజర్ న్యూస్ :** కల్వకుర్తి మున్సిపాలిటీ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ పై కౌన్సిలర్లు బాలు నాయక్, గోరటి శ్రీనివాసులు, నీరటి రవీందర్, హంలి హనుమ నాయక్, నేరటి పద్మ, షేక్ ఎజాస్ లు మంగళ వారం జిల్లా కలెక్టర్ పి, ఉదయ్ కుమార్ కు పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ పట్టణంలోని నాగర్ కర్నూల్ ప్రధాన రహదారి పక్కల వై ఆర్ ఆర్ కాంప్లెక్స్ నిర్మించడం జరిగిందని, కాంప్లెక్స్ యజమాని 40 ఫీట్ల రోడ్డు ఆక్రమించి ర్యాంపు వేయడం జరిగిందని దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు, అదేవిధంగా కాంప్లెక్స్ లో అనేక రకాల వ్యాపారాలు కొనసాగుతున్న ఎలాంటి ట్యాక్స్ వసూలు చేయడం లేదని, సామాన్య ప్రజలు ఏదైనా పన్ను చెల్లించని యెడల కమిషనర్ తన ప్రతాపాన్ని చూపిస్తూ కొందరి ఇండ్లకు, మార్కండేయ ఫంక్షన్ హాల్ కు , బాలు అనే వ్యక్తి మీ సేవ సెంటర్ కు తాళాలు వేయడం జరిగిందన్నారు, అదే విధంగా టాక్స్ కట్టని వై ఆర్ ఆర్ కాంప్లెక్స్ పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని కౌన్సిలర్లు ప్రశ్నించారు, పేదలపై తన ప్రతాపం చూపే కమిషనర్, ఈ కాంప్లెక్స్ పై ఎందుకు చర్యలు తీసుకుంట లేదో చెప్పాలని ప్రశ్నించారు, పట్టణంలోని 746/ఈ/1 సర్వే నెంబర్ లో రెండు ఎకరల భూమిలో బావాండ్ల మధు వెంచర్ ఏర్పాటు చేశాడు, దానిని అనుసరించి ఉన్న మరో నాలుగు ఎకరాల పొలానికి సదరు వ్యక్తి నకిలీ లే అవుట్ పత్రాలు సృష్టించి వెంచర్ చేసి ప్లాట్లు విక్రయించిన భావండ్ల మధు పై కమిషనర్ చర్యలు తీసుకోవడం లేదని పేర్కొన్నారు, సదరు పొలానికి 2023లో రైతు బంధు కూడా పడినట్లు కౌన్సిలర్లు కలెక్టర్కు విన్నవించారు, అదేవిధంగా 54/యు సర్వే నెంబర్ లో అఖిల బేగం వెంచర్ ఏర్పాటు చేసి జిపికి 1400 గజాల స్థలాన్ని ఇచ్చిందన్నారు, ఆ వెంచర్ పక్కనే మధు ఏర్పాటుచేసిన కేశవ నగర్ వెంచర్కు ఆనుకుని 1400 జిపి స్థలాన్ని ఇతరులకు విక్రయించడం జరిగిందని పేర్కొన్నారు, అక్రమ వెంచర్లు చేసి విక్రయించిన వారిపై చర్యలు తీసుకోవాలని పత్రిక సమావేశంలో వెల్లడించిన నేటికీ కమిషనర్ చర్యలు తీసుకోలేదని కౌన్సిలర్ ఫిర్యాదులో పేర్కొన్నారు, అక్రమ వెంచర్లు, వై ఆర్ ఆర్ కాంప్లెక్స్ పై చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్లు కలెక్టర్ కు విన్నమించారు.

## తీవ్ర కలకలం రేపిన కాయిల్ పేలిన ఘటన

### - సంఘటన స్థలాన్ని పరిశీలించిన సిఐ రవీందర్



**లింగాల, మేజర్ న్యూస్:** మండల పరిధిలోని అప్పాయిపల్లి గ్రామంలో కాయిల్ పేలిన ఘటన తీవ్ర కలకలం రేపగా మంగళవారం అచ్చంపేట సీఐ రవీందర్ సంఘటన స్థలానికి వెళ్లి విచారణ జరిపారు. ఎస్సై జగన్మోహన్ తెలిపిన వివరాల ప్రకారం అప్పాయిపల్లి గ్రామానికి చెందిన సవారయ్య కుమారుడు ధనుష్ (7) స్థానిక ప్రాథమిక పాఠశాలలో రెండవ తరగతి చదువుతున్నాడు. సోమవారం పాఠశాలలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో ధనుష్ ఇంటికి వెళుతుండగా రోడ్డుపై రెండు తీగలు అమర్చిబడి ఉన్న కాయిల్ వస్తువు దొరికింది. దాన్ని తీసుకొని వచ్చిన బాలుడు ఇంట్లో గల కరెంటు బోర్డు ప్లగ్గుపెట్టే హోల్స్ లో రెండు తీగలను పెట్టడంతో కాయిల్ పేలి ధనుష్‌కు గాయాలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు నాగర్ కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందించారు. బాధిత బాలుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మంగళవారం సంఘటన స్థాలానికి సీఐ రవీందర్, ఎస్సై జగన్మోహన్ పాటు జిల్లా బిడి టీం క్షుణ్ణంగా పరిశీలించి విచారణ చేయడం జరిగింది.

విలేకరులు కావలెను

సంచలన దినపత్రికగా పేరొందిన నేటి దినపత్రిక సూర్య లో పనిచేసేందుకు ఆసక్తి కలిగిన విద్యావంతులకు, విలేకరులకు

మహబూబ్‌నగర్ జిల్లా :
హన్వాడ, అడ్డాకుల, భూత్పూర్
గద్వాల జిల్లా : కేటిదొడ్డి, గట్టు, రాజోలి, మల్దకల్, ఇటిక్యాల
నారాయణపేట జిల్లా : నారాయణపేట ప్రతినిధి, రూరల్, టౌన్, కోస్గి టౌన్, గుండుమాల్

ఏరియాల్లో అవకాశం కల్పిస్తోంది.

సీనియర్లకు ప్రాధాన్యత ఇవ్వబడును.

ఆసక్తి కలిగిన వారు సంప్రదించాల్సిన నెంబరు
8008622757